# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 342 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 16 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 342 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 16 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు



హర్మూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక ( మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసు కున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్‌జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

- మిగతా 2లో





## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

పాకిస్థాన్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్ లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది

- మిగతా 2లో

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఐపీఓ
- కంపెనీకి 53.3 కోట్ల మంది కస్టమర్లు, అందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లు
- రూ.30,213 కోట్లు సమీకరించడమే లక్ష్యంగా ఐపీఓ ఇష్యూ
- భారత్‌ను అతిపెద్ద డిజిటల్ సొసైటీగా మార్చడమే లక్ష్యమన్న జియో

- మిగతా 2లో





# యాసంగిలో వరి వేయొద్దు...

## నీరు, విద్యుత్ కొరత తప్పదు..

- ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే నీటి సంక్షోభం: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న సీఎం
- యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి
- గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్

- మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్: ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



## సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

### రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం

- మిగతా 2లో



'సింగరేణి'ని ప్రైవేటీకరణ చేయబోం..

## చేయబోనివ్వం

- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

- మిగతా 2లో

## ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

### తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు

- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి
- పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం
- భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు
- సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి

- మిగతా 2లో



## సీఎం రేవంత్, ఉపముఖ్యమంత్రి భట్టి ఫెయిల్ అయ్యారు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో విద్యుత్ సరఫరా సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందస్తు ప్రణాళికలో విఫలమయ్యారని ఆరోపించారు. విద్యుత్ రంగంలో నెలకొన్న సమస్యలకు ప్రభుత్వ నిర్వహణ లోపాలే కారణమని

- మిగతా 2లో



దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

## 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

- మిగతా 2లో






## నారాయణపేటలో దారుణం

### పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

- వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య
- నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జరిగిన దారుణ ఘటన
- నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి
- నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు

- మిగతా 2లో

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది.

ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.

2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్.
ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
**హాల్టులు:** రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.

3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.

4. బిర్ – ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

**పొడిగించిన సర్వీసులు:**

1. బాంద్రా (T) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా – వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా – చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్–వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా–హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా–అమృతసర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్–రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా–గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి–రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (T)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ–కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
KSR బెంగళూరు–ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్–పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా–రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

## నారాయణపేటలో దారుణం

## పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది.మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు.

ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

# యాసంగిలో వరి వేయొద్దు...

**వరి సాగు వాయిదా వేసుకోండి..**

"గతేడాది ఈ సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకుపైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీళ్లనే పొదుపుగా వాడుకోవాలి. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకం. మళ్లీ వర్షాలు వచ్చేవరకు అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. హైదరాబాద్‌కు నీరందించే జలాశయాలూ ఎండిపోతున్నాయి. రైతులు పెద్దమనసు చేసుకుని.. ఒక వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. యాసంగిలో వరి పంట వేయొద్దు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

**కేంద్రం ఆదుకోవాలి..**

ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. సగటుపై అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. అక్టోబరులో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు. మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి. కేంద్ర–రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి.

**విపక్షాలు కలిసి రావాలి..**

సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కేంద్రం నుంచి అధిక నిధులు పొందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించాం. విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలి. ప్రకృతి విపత్తును జయించేందుకు అందరి సహకారం కావాలి. దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## 'సింగరేణి'ని ప్రైవేటీకరణ చేయబోం.. చేయబోనివ్వం: మంత్రి శ్రీధర్‌బాబు

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని

మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి: తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్

సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

- మొదటి పేజీ తరువాయి

చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్–2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

# సీఈసీని రక్షించేందుకే ఇదంతా

- మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ**

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

**'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా**

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

**సీజేపీ నేతల అరెస్ట్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

## సీఎం రేవంత్, ఉపముఖ్యమంత్రి భట్టి ఫెయిల్ అయ్యారు

- మొదటి పేజీ తరువాయి

ఆయన వ్యాఖ్యానించారు.

బొగ్గు నిల్వలను ముందుగానే సిద్ధం చేసుకోవడంలో, విద్యుత్ రంగంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తిన తర్వాత అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపుతూ తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. అయితే, ఇవి హరీశ్‌రావు చేసిన రాజకీయ విమర్శలు మాత్రమే.

## హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు

చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళ్తున్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా.. అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.

హర్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో

ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

ఉదయం పూట తరగతులు జరుగుతుండగా పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ తన మెగా ఐపీఓకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ, జియో సాధించిన ప్రగతిని, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. దేశవ్యాప్త వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 60 శాతానికి పైగా వాటాను జియో నెట్‌వర్క్ దక్కించుకుందని ఆయన వెల్లడించారు. 2026 జూన్ 30 నాటికి జియో వినియోగదారుల సంఖ్య 53.3 కోట్లకు చేరిందని, వీరిలో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులేనని ఆకాశ్ అంబానీ తెలిపారు. చైనా మినహా ప్రపంచంలోనే ఇంతటి భారీ కస్టమర్ బేస్ కలిగిన ఏకైక సంస్థగా జియో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 43.7 జీబీకి పెరిగిందని, ఇది దేశంలో మారుతున్న డిజిటల్ అవసరాలకు నిదర్శనమని వివరించారు. 2016లో జియో సేవలు ప్రారంభమైన సమయంలో దేశంలో సగటు ఇంటర్నెట్ డౌన్‌లోడ్ వేగం కేవలం 2.5 ఎంబీపీఎస్‌గా ఉండగా, ఇప్పుడు అది 68 ఎంబీపీఎస్‌కి పెరిగిందని ఆయన గుర్తుచేశారు. జియో 5జీ సగటు డౌన్‌లోడ్ స్పీడ్ 198.9 ఎంబీపీఎస్‌గా నమోదైందని పేర్కొన్నారు. సరసమైన ధరలకే డేటా లభిస్తుండటంతో ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ చెల్లింపులు వంటి సేవలు గణనీయంగా విస్తరించాయని ఆయన అభిప్రాయపడ్డారు.కంపెనీ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,60,537 టవర్లు, 26,800 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌తో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నిర్వహణ లాభం 17.8 శాతం వృద్ధితో రూ. 76,225 కోట్లుగా నమోదైందని తెలిపారు. అలాగే, జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య కూడా 2.8 కోట్లకు చేరుకుందని వివరించారు.భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆకాశ్ అంబానీ పునరుద్ఘాటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్, పరికరాలను అంతర్జాతీయ ఆపరేటర్లకు విక్రయించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామని, అందులో ప్రధాన వాటాను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ ఐపీఓ ద్వారా ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిలో గరిష్ఠంగా రూ. 30,213 కోట్లను సమీకరించాలని జియో భావిస్తోంది. ఈ ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల నూతన షేర్లను జారీ చేయనుంది. ఇది భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలవనుంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# విదేశీ బొగ్గు దిగుమతిలో భారీ కుంభకోణం

## ఒప్పందాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్

### ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర బొగ్గు, గనుల మంత్రికి బహిరంగ లేఖలు



**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల భారీ కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కావాలనే బొగ్గు కృత్రిమ కొరత, కరెంట్ సంక్షోభం సృష్టించి.. అదనుచూసి తమ అనుకూల కంపెనీని రంగంలోకి దింపారని విమర్శించారు. 'భోత్రా లాజిస్టిక్స్' అనే కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం,

- మిగతా 6లో...



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో బతుకమ్మ పండుగ సందడి..

# పూల పండుగతో..! పరిమళించిన మేడ్చల్ కలెక్టరేట్..!

## సంప్రదాయాల సోయగం.. సమైక్యతల సందేశం..కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరం..!

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు..
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన పూల బతుకమ్మలు..
- ఆటపాటలతో సందడి చేసిన జిల్లా మహిళా అధికారులు, సిబ్బంది..
- మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీకగా బతుకమ్మ పండుగ వేడుకలు..
- ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు బతుకమ్మ సందేశం..
- తెలంగాణ సాంస్కృతిక సారథుల పాటలతో మార్మోగిన కలెక్టరేట్ ప్రాంగణం..
- ప్రకృతి పరిరక్షణలోనూ ప్రత్యేక స్థానం పొందిన ఆరవరోజు అలిగిన బతుకమ్మ..

**మాధవ్ పత్తి.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15:**

పూల పరిమళంలో సాంప్రదాయం.. పాటల పరవశంలో సమైక్యతను.. మహిళల ఉత్సాహంలో తెలంగాణ సంస్కృతి వైభవం.. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలకు అద్దం పడుతూ, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలిచింది.. ప్రకృతితో మమేకమై, పూలనే పూజగా మలిచి, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ పూల పండుగ రాష్ట్ర సంస్కృతిని, కీర్తిని సప్త సముద్రాలు దాటించి, మకుటాయమానంగా నిలుస్తోంది..మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన బతుకమ్మ వేడుకలు ఈ సంస్కృతి స్ఫూర్తిని మరోసారి చాటిచెప్పాయి..

-4లో



# శరన్నవరాత్రి ఉత్సవాల్లో..! లలితా త్రిపుర సుందరి రూపం..

- రాజీవ్ గృహకల్పలో వైభవంగా అమ్మవారి నవరాత్రి వేడుకలు..
- కుంకుమార్చనల పూజలతో మార్మోగిన కనకదుర్గమ్మ మండపం..

- సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు..
- ఐదవ రోజు లలితా త్రిపుర సుందరి రూపంలో అమ్మవారికి అలంకరణ..
- శ్రీ కనకదుర్గమ్మ మండపంలో గోగులపాటి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు..
- సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు..
- గోగులపాటి కృష్ణ మోహన్ సమక్షంలో వైభవంగా పూజా కార్యక్రమాలు..
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు.. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణ

-5లో

# కీసర తహాశీల్దార్ ఆఫీసులో..! అవినీతి జలగలు..!



- రూ.2.5 లక్షల 'లంచం'తో ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్, మరో ఇద్దరు..!
- భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు లంచం డిమాండ్..!
- రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ సందీప్ కుమార్ రెడ్డి..!
- మొదటి విడతలో భాగంగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన ముగ్గురు..
- నయాబ్ తహశీల్దార్ తోపాటు ఏసీబికి చిక్కిన ప్రైవేట్ వ్యక్తి కావలి బాలకృష్ణ..
- వీఆర్వో నన్నూరి విజయ్ కుమార్ రెడ్డి పాత్రపైనా..కీలక ఆరోపణలు..
- ఆయన సూచనల మేరకే లంచం స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడి..
- ముగ్గురినీ ఏసీబీ కోర్టుకు తరలింపు.. కేసు దర్యాప్తులో ఉందని ఏసీబీ ప్రకటన..

-6 లో



# కేసీఆర్ ఫాంహౌస్‌కు ఆ వెసులుబాటు ఎందుకు?

- పంచపాండవుల చెరువు నుంచి అక్కడికి సాగునీరు
- ఆ పంపుల కనెక్షన్ తొలగించేందుకు కేసీఆర్ ముందుకు వస్తారా?
- కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఎన్నిసార్లయినా చర్చించేందుకు సిద్ధం: సీఎం రేవంత్‌రెడ్డి

-6 లో



కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ పండుగ ఆటపాటలతో మహిళలా అధికారుల స్టెప్పులు..



# పూల పండుగతో..! పరిమళించిన మేడ్చల్ కలెక్టరేట్..!



## సంప్రదాయాల సోయగం.. సమైక్యతల సందేశం..కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరం..!

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు..
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన పూల బతుకమ్మలు..
- ఆటపాటలతో సందడి చేసిన జిల్లా మహిళా అధికారులు, సిబ్బంది..
- మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీకగా బతుకమ్మ పండుగ వేడుకలు..
- ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు బతుకమ్మ సందేశం..
- తెలంగాణ సాంస్కృతిక సారథుల పాటలతో మార్మోగిన కలెక్టరేట్ ప్రాంగణం..
- ప్రకృతి పరిరక్షణలోనూ ప్రత్యేక స్థానం పొందిన ఆరవరోజు అలిగిన బతుకమ్మ..

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15:

పూల పరిమళంలో సాంప్రదాయం.. పాటల పరవశంలో సమైక్యతను.. మహిళల ఉత్సాహంలో తెలంగాణ సంస్కృతి వైభవం.. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలకు అద్దం పడుతూ, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలిచింది.. ప్రకృతితో మమేకమై, పూలనే పూజగా మలిచి, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే ఈ పూల పండుగ రాష్ట్ర సంస్కృతిని, కీర్తిని సప్త సముద్రాలు దాటించి, మకుటాయమానంగా నిలుస్తోంది..మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన బతుకమ్మ వేడుకలు ఈ సంస్కృతి స్ఫూర్తిని మరోసారి చాటిచెప్పాయి..

మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో, మహిళా అధికారులు, సిబ్బంది బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. పూలను పేర్చి.. సాంప్రదాయాలను చాటిచెప్పి.. పాటలు, నృత్యాలతో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు జిల్లా కలెక్టరేట్‌లో అంబరాన్నంటాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు, సాంప్రదాయ పాటలు, ఉత్సాహభరితమైన నృత్యాలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ వేడుకలను సంయుక్తంగా నిర్వహించారు.. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా బతుకమ్మలను అందంగా అలంకరించి మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయ బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆటపాటలతో సందడి చేస్తూ పండుగ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు..

## మహిళల సాధికారతకు ప్రతీకగా బతుకమ్మ..

బతుకమ్మ పండుగ కేవలం పూలతో జరుపుకునే వేడుక మాత్రమే కాదని, తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యత, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళల సాంస్కృతిక వారసత్వాన్ని, సమాజంలో వారి పాత్రను చాటిచెప్పే కీలక పండుగగా బతుకమ్మకు విశిష్ట స్థానం ఉందని తెలిపారు.. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సాంప్రదాయం మహిళల మధ్య అనుబంధాన్ని, బలోపేతం చేయడంతోపాటు తెలంగాణ ప్రత్యేక సంస్కృతి గుర్తింపును మరింతగా చాటిచెబుతోందని వివరించారు..

## అధికారుల కుటుంబ సభ్యులు, మహిళా సిబ్బంది సందడి..

ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా, డిప్యూటీ కలెక్టర్లు మోక్షిత, బరీరా ఫరీద్, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖాధికారి పద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ఎస్టీఓ అలివేలుమంగ తదితరులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆడారు. మహిళా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొని పండుగ సందడిని మరింత పెంచారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథులు ఆలపించిన బతుకమ్మ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ గీతాల నడుమ మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలు పాల్గొన్న వారిలో పండుగ ఆనందాన్ని నింపాయి..







## ప్రకృతితో మమేకమయ్యే పూల పండుగ..

బతుకమ్మకు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణతో విడదీయలేని అనుబంధం ఉంది. వివిధ రకాల సహజ పుష్పాలతో బతుకమ్మలను పేర్చి పూజించడం ప్రకృతి పట్ల తెలంగాణ ప్రజలకున్న ఆరాధనా భావాన్ని ప్రతిబింబిస్తుంది.. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని గుర్తుచేయడంలోనూ ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రకృతితో మమేకమై జీవించాలనే సందేశాన్ని బతుకమ్మ అందిస్తుందని వేడుకల సందర్భంగా గుర్తుచేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్ మహిళా సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..







గోగులపాటి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు..

లలితా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు..

- సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు..
- ఐదవ రోజు లలితా త్రిపుర సుందరి రూపంలో అమ్మవారికి అలంకరణ..
- శ్రీ కనకదుర్గమ్మ మండపంలో గోగులపాటి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు..
- సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు..
- గోగులపాటి కృష్ణ మోహన్ సమక్షంలో వైభవంగా పూజా కార్యక్రమాలు..
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు.. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ..



గోగులపాటి కృష్ణమోహన్..

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో..! లలితా త్రిపుర సుందరి రూపం..



మహిళల సామూహిక కుంకుమార్చనలు..

- రాజీవ్ గృహకల్పలో వైభవంగా అమ్మవారి నవరాత్రి వేడుకలు..
- కుంకుమార్చనల పూజలతో మార్మోగిన కనకదుర్గమ్మ మండపం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 15:** సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్పలో శ్రీ కనకదుర్గమ్మ మండపంలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి.. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆ జగన్మాతను శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తిపూర్వకంగా దర్శించుకునేందుకు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మండపం భక్తజన సందడితో కళకళలాడింది.. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణ మోహన్ సమక్షంలో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.. లలితా సహస్రనామ పారాయణలతో అమ్మవారిని స్తుతిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. వేదమంత్రాలు, భక్తి నామస్మరణల మధ్య సాగిన పూజా కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించాయి..

## లలితా త్రిపుర సుందరి రూపంలో అలంకరణ..

హిందూ సంప్రదాయంలో శరన్నవరాత్రులకు విశిష్ట స్థానం ఉంది. తొమ్మిది రోజుల పాటు జగన్మాతను వివిధ రూపాల్లో ఆరాధిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.. ఇందులో భాగంగా శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారిని పూజించడం విశేషంగా భావిస్తారు.. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు సమృద్ధిగా ఉండాలని భక్తులు ప్రార్థించారు.. లోకకల్యాణం, సమాజ శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు.. కాలనీలో ఏటా నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సామూహిక భక్తికి వేదికగా నిలుస్తున్నాయి.. మహిళలు ఉత్సాహంగా పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ పూజా మహోత్సవంలో లక్ష్మీ దుర్గ, విజయ, ఉష, బృంద, వెంకట లక్ష్మి, రమ్య, లక్ష్మి, స్వాతి, శిరీష, జైశ్రీ, జై లక్ష్మి, అరుణ తదితర భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు..

పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, కాలనీ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని భక్తులు ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో సాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలతో రాజీవ్ గృహకల్ప సూరారం కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది..

# గ్యాంగ్ రేప్ కేసుల్లో మహిళలకూ శిక్ష తప్పదు.. ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు!

**న్యూఢిల్లీ పెన్ పవర్:** సామూహిక అత్యాచార కేసుల్లో మహిళలపైనా గ్యాంగ్ రేప్ అభియోగాలు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నేరానికి సంబంధించిన శారీరక చర్యలో మహిళ ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, అత్యాచారం జరగాలనే ఉమ్మడి ఉద్దేశంతో సహకరిస్తే సంబంధిత చట్టాల కింద అభియోగాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. జస్టిస్ అనూప్ జైరామ్ భంభానీ ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

**ఉమ్మడి ఉద్దేశమే కీలకం**

గ్యాంగ్ రేప్‌కు సంబంధించిన ఐపీసీ సెక్షన్ 376డీ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 70లోని 'వ్యక్తులు' అనే పదాన్ని పురుషులకే పరిమితం చేయలేమని ధర్మాసనం పేర్కొంది. సామూహిక అత్యాచారానికి సహకరించిన వ్యక్తి మహిళ అయినంత మాత్రాన ఆ అభియోగం నుంచి మినహాయింపు లభించదని తెలిపింది. బాధితురాలిని బెదిరించడం, అత్యాచారానికి బలవంతం చేయడం లేదా నేరం జరిగేందుకు ఉద్దేశపూర్వకంగా సహకరించడం వంటి అంశాలు కేసులో కీలకంగా మారవచ్చని కోర్టు అభిప్రాయపడింది.

**మైనర్ బాలిక కేసులో తీర్పు**

మైనర్ బాలికను మరో నిందితుడితో లైంగిక సంబంధాలకు బలవంతం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అయితే, ఈ తీర్పు మహిళ నేరం చేసినట్లు నిర్ధారించినది కాదు. ఆమెపై అభియోగాలు నమోదు చేసి విచారణ కొనసాగించవచ్చా అనే అంశంపైనే కోర్టు నిర్ణయం తీసుకుంది. మహిళ స్వతంత్రంగా అత్యాచార నేరానికి పాల్పడగలదా అనే విస్తృతమైన న్యాయ ప్రశ్నపై ఈ తీర్పులో ఎలాంటి నిర్ణయం ఇవ్వలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. సామూహిక లైంగిక నేరాల్లో ఉమ్మడి ఉద్దేశంతో సహకరించిన వారి బాధ్యతను నిర్ణయించడంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.



# కీసర తహశీల్దార్ ఆఫీసులో..! అవినీతి జలగలు..!

- రూ.2.5 లక్షల 'లంచం'తో ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్, మరో ఇద్దరు..!
- భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు లంచం డిమాండ్..!
- రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ సందీప్ కుమార్ రెడ్డి..!
- మొదటి విడతలో భాగంగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన ముగ్గురు..
- నయాబ్ తహశీల్దార్ తోపాటు ఏసీబీకి చిక్కిన ప్రైవేట్ వ్యక్తి కావలి బాలకృష్ణ..
- వీఆర్వో నన్నూరి విజయ్ కుమార్ రెడ్డి పాత్రపైనా..కీలక ఆరోపణలు..
- ఆయన సూచనల మేరకే లంచం స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడి..
- ముగ్గురినీ ఏసీబీ కోర్టుకు తరలింపు.. కేసు దర్యాప్తులో ఉందని ఏసీబీ ప్రకటన..



మేడ్చల్ జిల్లా కీసర తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీకి పట్టుబడిన ముగ్గురు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్, మరో ప్రభుత్వ ఉద్యోగి, ఓ ప్రైవేట్ వ్యక్తి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. అనధికారిక పరమైన పనిని పూర్తి చేసేందుకు రూ. 5 లక్షల లంచం డిమాండ్ చేసి, అందులో మొదటి విడతలో భాగంగా రూ. 2.50 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ రంగారెడ్డి రేంజ్ అధికారులు వారిని ఉన్నపళంగా పట్టుకున్నారు.. ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. కీసర మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అమనగంటి సందీప్ కుమార్ రెడ్డి (ఏఓ-1) ఫిర్యాదుదారుడి నుంచి రూ. 5 లక్షల లంచం డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడి తల్లి, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను పూర్తి చేసేందుకు, ఈ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది.. ఈ వ్యవహారంలో ప్రైవేట్ వ్యక్తి కావలి బాలకృష్ణ (ఏ-2) ద్వారా ఫిర్యాదుదారుడి నుంచి లంచం మొత్తాన్ని స్వీకరించినట్లు తెలిపారు..

## వీఆర్‌వో సూచనల మేరకు లంచం స్వీకరణ..

గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) నన్నూరి విజయ్ కుమార్ రెడ్డి (ఏఓ-3) సూచనల మేరకు బాలకృష్ణ లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు ప్రకటనలో వెల్లడించారు.. డిమాండ్ చేసిన రూ.5 లక్షల్లో మొదటి విడతగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు..
బాలకృష్ణ వద్ద నుంచి రూ.2.50 లక్షల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది. డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో తమ విధులను తాకట్టు పెట్టి ఈ అవినీతికి పాల్పడినట్లు అనిశా అధికారులు స్పష్టం చేశారు.. పట్టుబడిన ముగ్గురిని నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు.

# కేసీఆర్ ఫాంహౌస్‌కు ఆ వెసులుబాటు ఎందుకు?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో నాలుగు కోట్ల మందికి లేని ప్రత్యేక ఏర్పాట్లు, వెసులుబాటు కేసీఆర్‌కు ఎందుకు? కొండపోచమ్మ రిజర్వాయరు నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి.. అక్కడి నుంచి ఆయన ఫాంహౌస్‌లోకి సాగునీటిని మళ్లించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఆ పంపుల కనెక్షన్ తొలగించేందుకు ముందుకు వస్తారా? అని ప్రశ్నించారు. ఫాంహౌస్‌కు నీటి తరలింపుపై నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? అని భారాస నాయకులకు సవాల్ విసిరారు. గురవారమిక్కడ సచివాలయంలో విలేకరులతో సీఎం మాట్లాడారు...

**ఆ రాష్ట్రాల్లో ఎవరున్నారు...**

"మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడులో ఏ ప్రభుత్వాలున్నాయి? యూకేలో కాంగ్రెస్ పార్టీ ఉందా? వంద దేశాల్లో ఎల్‌నినో సమస్య ఉందని ఓవైపు ఐరాస చెబుతోంది. భారాస నాయకులు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అంటూ ఒకాయన మహబూబ్‌నగర్‌లో అన్నారు. 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 515 టీఎంసీలని సంతకం పెట్టిందెవరు? బచావత్ ట్రైబ్యునల్ వద్ద శాశ్వతంగా తెలంగాణకు మరణ శాసనం రాసిందెవరు? కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను శాశ్వతంగా ధారాదత్తం చేశారు. చంద్రబాబు ముందు మోకరిల్లి సంతకం పెట్టారు. తిరుపతి వెళ్లినపుడు రోజా రాగిసంకటి పెడితే రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పారు. పాలమూరు నుంచి ఎంపీగా గెలిపిస్తే.. అక్కడివారికి నీళ్లు ఇవ్వాలని ఒక్కరోజు అయినా మాట్లాడారా? కల్వకుర్తి పూర్తిచేయలేదు. పాలమూరు-రంగారెడ్డి, బీమా, నెట్టెంపాడు, సీతారామ, కోయిల సాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులదీ అదే పరిస్థితి.

**ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆ స్థాయి నష్టం జరగలేదు...**

సాగునీటి ప్రాజెక్టులపై రూ. 1.8 లక్షల కోట్లు ఖర్చుచేశారు. రూ. 40వేల కోట్లు బకాయిలు పెట్టారు. పాలమూరు- రంగారెడ్డి పంపులు ఆన్‌చేస్తే భారాస నాయకులకు కడుపుమంట వస్తోంది. కృష్ణా నీటిని శాశ్వతంగా
చంద్రబాబు, జగన్‌కు తాకట్టు పెట్టారు. కృష్ణాజలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ అంత నష్టం జరగలేదు. కానీ తెలంగాణ ఏర్పాటైన తరువాత జరిగింది. భారాస నాయకులు అబద్ధాలు చెప్పి..బయట తిరుగుతాం అంటున్నారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఎన్నిసార్లయినా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధం. భారాస నాయకులు సిద్ధమా? గోదావరి నదిపై ఊరు, పేరు మార్చి రూ. లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు గోదావరిలో కొట్టుకుపోయింది. ఇప్పుడే మేడిగడ్డ కూలగొట్టి మళ్లీ కట్టాలంటున్నారు. ప్రజలు అమాయకులు కాదు.. వారికి అన్నింటిపై అవగాహన ఉంది."అని అన్నారు.

# విదేశీ బొగ్గు దిగుమతిలో భారీ కుంభకోణం

-3 పేజీ తరువాయి

సింగరేణి చేసుకున్న అన్ని ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం కేటీఆర్ వేర్వేరుగా బహిరంగ లేఖలు రాశారు."సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా.. దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా.. దేశీయ సరఫరాను పెంచే చర్యలు తీసుకోకుండా.. విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం.. ఇప్పుడు కరెంట్ కోతలపై జనం, రైతుల ఆందోళనను బూచిగా చూపించి.. దిగుమతులను అనుకూలంగా మలచుకోవడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉంది. టన్నుకు రూ. 1,500 కమీషన్ చొప్పున ఏకంగా రూ. 3,000 కోట్ల దోపిడీకి చీకటి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిసిపోయింది. అందుకే ఇన్నాళ్లూ కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించకుండా హడావిడిగా విదేశీ బొగ్గు స్కాంకు తెరలేపారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేంటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? ఆ కంపెనీకి ఇప్పటివరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ మెట్రో అనాథ !

**హైదరాబాద్ అక్టోబరు 15 పెన్ పవర్:** దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతోపోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్‌తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ
పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి. కానీ భాగ్యనగరంలో మొదటి దశ 69 కిలోమీటర్ల మేర పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, రెండో దశ విస్తరణ మాత్రం ఫైళ్ల దశను దాటి పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లకు పైగా అంచనాతో 122 కిలోమీటర్ల పైబడిన ఫేజ్-2 డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పిస్తున్నప్పటికీ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచిరావాల్సిన కీలక ఆమోదాలు, నిధుల భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం రావడం లేదు. ఉత్తరాది నగరాల ప్రాజెక్టులకు, మహారాష్ట్ర, గుజరాత్ మెట్రో నెట్‌వర్క్‌లకు కేంద్ర బడ్జెట్‌లలో వేల కోట్ల రూపాయలనుకేటాయిస్తున్న మోదీ సర్కార్.. దేశానికే భారీగా పన్నులు చెల్లిస్తున్న హైదరాబాద్ మెట్రో విషయానికి వచ్చేసరికి మాత్రం కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తోందన్నవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌కు గనక సమగ్రమైన ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు అందితే.. అది ముంబై, బెంగళూరులను సైతం వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరిస్తుందన్న వాస్తవం కేంద్ర పెద్దలకు తెలియంది కాదు.తక్కువ జీవన వ్యయం, మెరుగైన శాంతిభద్రతలు, ఐటీ-ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా మెట్రో పూర్తయితే అంతర్జాతీ య పెట్టుబడులన్నీ ఇక్కడికేపోటెత్తుతాయి. అందుకే, ఇతర రాష్ట్రాల నగరాల పోటీతత్వాన్ని కాపాడేందుకు హైదరా బాద్‌పై ఆర్థిక, మౌలిక వసతులపరమైన ఆంక్షలు పరోక్షం గా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి .రాజ కీయనాయకత్వ బలహీనతలు, కేంద్ర వివక్ష కారణంగా అంతిమంగా నష్టపోతున్నది సామాన్య హైదరాబాద్ పౌరుడే. ట్రాఫిక్ రద్దీతో నిత్యం నరకం చూస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు మెట్రోవిస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కేంద్రం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం తక్షణమే సంపూర్ణ అనుమతులు మంజూరు చేసి, తన వాటా నిధులను విడుదల చేయాల్సినచారిత్రక అవసరం ఉంది. లేకపోతే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మహానగరానికి అన్యాయం చేసినట్లే అవుతుంది

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

**ఆటపాటలు, కోలాటాలతో సందడిగా సాగిన వేడుకలు**



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 15 :** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు ఆర్ఎస్ నగర్ కాలనీలో బుధవారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కాలనీలోని ఆడపడుచులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఆటపాటలు, కోలాటాలతో కాలనీ అంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ఒకరితో ఒకరు ఆనందాన్ని పంచుకుంటూ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు సైతం ఈ వేడుకల్లో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్ఎస్ నగర్ కాలనీలో నిర్వహించిన ఈ వేడుకలు స్థానికుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పైపులైన్లకు పరిహారం ఏదీ?



బాధితురాలు నూతన పాటి త్రివేణి

**గార్ల ,పెన్ పవర్, అక్టోబర్ :15** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా దెబ్బతిన్న వ్యవసాయ పైపులైన్లకు పరిహారం చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుల్లూరు గ్రామానికి చెందిన నూతనపాటి త్రివేణి అధికారులను కోరారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు పరిహారం అందలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.పాలేరు లింకు కెనాల్ నిర్మాణంలో భాగంగా 34.085 నుంచి 36.240 కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టినట్లు త్రివేణి తెలిపారు. ఇందులో తనకు చెందిన సర్వే నంబరు 159లోని 18 గుంటల భూమి ప్రాజెక్టు పరిధిలోకి వెళ్తోందని పేర్కొన్నారు. సర్వే నంబరు 147లోని బావి నుంచి 159, 160 సర్వే నంబర్లలో ఉన్న 4 ఎకరాల 30 గుంటల వ్యవసాయ భూమికి సాగునీరు అందించేందుకు పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణంతో సర్వే నంబరు 160లోని పైపులైన్లు దెబ్బతిన్నాయని తెలిపారు.ఈ సమస్యపై 2020 నవంబర్ 19న గార్ల తహసీల్దార్ ద్వారా ఆర్డీవోకు దరఖాస్తు సమర్పించడంతో పాటు, 2021 జనవరి 27న మరోసారి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. అయినప్పటికీ తుది పరిహారం జాబితాలో పైపులైన్ల నష్టాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి నిబంధనల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## వివాదంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి !

**హైదరాబాద్ అక్టోబరు 15 పెన్ పవర్:**
జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి కుటుంబం , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య వివాదం ముదిరింది. వీసీ భార్య సుజనా రెడ్డి తనపై చేసిన ఫిర్యాదులోని ఆరోపణలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌లో తనను తిట్టినట్లు, బెదిరించినట్లు సుజనా రెడ్డి చేసిన వాదనలు పూర్తిగా అవాస్తవమని, అసలు ఆమె ఎవరో కూడా తనకు తెలియదని, ఎప్పుడూ చూడలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థను వివాదాల్లోకి లాగుతూ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయనమండిపడ్డారు.ఈ వివాదానికి అసలు మూలం వీసీ తీరుపై మహిళా ప్రొఫెసర్లు చేసిన ఫిర్యాదేనని పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడించారు. తాను జేఎన్‌టీయూ వీసీకి ఫోన్ చేసినప్పుడు ఆయన బాత్‌రూమ్‌లోఉండటంతో వేరే వ్యక్తి ఫోన్ ఎత్తి మాట్లాడారని, తాను వీసీతోనే మాట్లాడతానని చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిపారు. ఆ తర్వాత వీసీతో మాట్లాడినప్పుడు... సీనియర్ ప్రొఫెసర్లను, ముఖ్యంగా మహిళాప్రొఫెసర్లను తీవ్ర పదజాలంతో దూషించడానికి కారణమేమిటని తాను నిలదీసినట్లు చెప్పారు. తనపై ఏమైనా కోపం ఉంటే నేరుగా తనను ప్రశ్నించవచ్చు కానీ, మహిళా ఆచార్యుల పట్ల అలా వ్యవహరించడంతప్పు కదా అని అడిగినట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ సంభాషణ సమయంలో తన తప్పును అంగీకరించిన వీసీ కిషన్ కుమార్ రెడ్డి క్షమాపణ కోరారని, తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత దీనిపైలిఖితపూర్వకంగా లేఖ ఇస్తానని చెప్పారని పల్లా తెలిపారు. అయితే మరుసటి రోజు సాయంత్రం వరకు వీసీ నుంచి ఎలాంటి లేఖ రాకపోవడంతో, బాధితులైన మహిళా ప్రొఫెసర్లు స్వయంగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నుంచి దృష్టి మళ్లించేందుకే వీసీ తన భార్యను అడ్డుపెట్టుకుని తనపై వ్యతిరేక ఫిర్యాదు చేయించారని ఆయన ఆరోపించారు.మరోవైపు వీసీ కుటుంబంమాత్రం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తమను ఫోన్ ద్వారా బెదిరించారని, తప్పుడు కేసులు పెట్టిస్తానంటూ హెచ్చరించారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ వ్యవహారంలో నిజానిజాలునిగ్గు తేల్చడానికి పోలీసులు కేవలం ఒకరి మాటలకే పరిమితం కాకుండా, సంబంధిత సీసీటీవీ ఫుటేజీలు, కాల్ రికార్డులు, మహిళా ప్రొఫెసర్లతో వీసీ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తుజరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. వర్సిటీ పరువును బజారుకీడ్చేలా సాగుతున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయ , విద్యావర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

## సింగరేణిలో వేడెక్కుతున్న రాజకీయం..!

**హైదరాబాద్ అక్టోబరు 15 పెన్ పవర్:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలకు నగారా మోగనుంది. అయితే ఈ లోపే సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలనుఅప్రమత్తం చేశాయి. వేలాది మంది కార్మికుల కుటుంబాలు సింగరేణి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇలాంటి ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహాలకు పదునుపెడుతున్నాయి.సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతం దాదాపు 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడి కార్మికులు, వారికుటుంబాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై గట్టిగా ఉంటుంది. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతం నుంచి కూడా సింగరేణి గుర్తింపు సంఘంఎన్నికల్లో గెలిచిన పార్టీనే ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధిస్తుందనే బలమైన నమ్మకం రాజకీయ వర్గాల్లో ఉంది.గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే యూనియన్ ఎన్నికలుజరుగాయి. అయితే ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. నవంబర్ లేదా డిసెంబర్ నాటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికేన్యాయస్థానంలో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ వైఖరి, కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు, రాజకీయపక్షాలు గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశాయి.ఎన్నికలు రాబోతున్నాయన్న సంకేతాలు రావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి.ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ఉద్యోగాలు, గృహ నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారం వంటి హామీలతో కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దసరా పండగవేళ ప్రకటించిన భారీ బోనస్ కూడాతమకు కలిసొస్తుందని నమ్ముతోంది.ఇక.. ప్రతిపక్ష బీఆర్ఎస్ దూకుడు మీదుంది. గల్ఫ్, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తమకు మంచి పట్టు ఉందని ఆ పార్టీ నమ్ముతోంది. దాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అనుబంధ సంఘం అయిన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక గర్జనలు, బహిరంగ సభలను నిర్వహిస్తోంది. ఇవాళ చలో సింగరేణికి పిలుపునిచ్చిన ఆ పార్టీ...సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వంపై ఎక్కుపెడుతోంది.

# దేశ్యాతండ తాగునీటి కష్టాలకు విముక్తి కొత్త మోటారు ఏర్పాటు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్ :15**
చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దేశ్యతండలో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ గుగులోత్ భద్రు నాయక్ ప్రత్యేక చొరవ చూపారు. గ్రామంలో పాత విద్యుత్ మోటారు తరచూ మరమ్మతులకు గురవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ పంచాయతీ నిధులతో నూతన విద్యుత్ మోటారును కొనుగోలు చేయించి ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ భద్రు నాయక్ చొరవ తో తాగునీటి కష్టాలు కొత్త మోటార్ వల్ల తాగునీటి కష్టాలు తీరడంతో దేశ్యా తండా గ్రామ ప్రజలు సర్పంచు కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్, సిబ్బంది రాందాస్, సర్వన్, వెంకన్న, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.



కొత్త మోటర్ ఫిట్ చేస్తున్న సర్పంచ్

# సద్దుల బతుకమ్మకు ఘాట్ ముస్తాబు ఏర్పాట్లపై సర్పంచ్ పరిశీలన



బతుకమ్మ ఘాటును పరిశీలిస్తున్న సర్పంచ్ ఉప సర్పంచ్

**గార్ల ,పెన్ పవర్, అక్టోబర్: 15** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గార్ల గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ముందస్తు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఎ గ్రామ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్, ఉపసర్పంచ్ జరీనా రహీం ఖాన్ గురువారం ఘాట్‌ను పరిశీలించి పండుగ ఏర్పాట్లను సమీక్షించారు.
ఘాట్ సమీపంలో ఏళ్లుగా పనిచేయకుండా ఉన్న బోరు మోటారును పరిశీలించారు.సద్దుల బతుకమ్మలోపు మోటారుకు మరమ్మతులు చేయించి మహిళలకు నీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో ఘాట్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, ఘాట్‌కు వెళ్లే మార్గాన్ని చదును చేసే పనులు చేపట్టారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై గల్లీ మౌనం - రోడ్డెక్కని బాధితుల పోరాటాలు!

**హైదరాబాద్ అక్టోబరు 15 పెన్ పవర్:**
తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్లజాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు , శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు , అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలోపెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్‌మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోఉన్నప్పటికీ,సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమఫిర్యాదులను పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనేఅనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్‌పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

# మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భవన

**హైదరాబాద్ అక్టోబరు 15 పెన్ పవర్:**
హైదరాబాద్ నగర చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భారీ ఆకాశహర్మ్యం నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై తెలంగాణ హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అబిడ్స్ సమీపంలోని గన్‌ఫౌండ్రీ పరిధిలో మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన మీనాక్షి ఎలీసియా ప్రాజెక్టు చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది.సొసైటీ ఫర్ క్రూసేడ్ అగైనెస్ట్ కరప్షన్ దాఖలు చేసిన ఈ ప్రజాహిత వ్యాజ్యంలో.. 2022 ఆగస్టు 23న జారీ చేసిన భవన నిర్మాణ అనుమతి నిబంధనలకు విరుద్ధంగా ఉందని, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండానే అధికారులు అనుమతులు ఇచ్చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.ఈ విచారణ సందర్భంగా భవనం ఎత్తు, నిర్మాణ విస్తీర్ణంపై న్యాయస్థానం ఆరా తీసింది. ఈప్రాజెక్టులో 2 సెల్లార్ లెవల్స్, మరో 5 ప్రత్యేక లెవల్స్‌తో పాటు ఏకంగా 35 అంతస్తుల నిర్మాణం జరుగుతోందని తెలియడంతో ధర్మాసనం నివ్వెరపోయింది. శతాబ్దాల చరిత్ర కలిగిన మొజాంజాహీ మార్కెట్‌వంటి హెరిటేజ్ నిర్మాణాల పరిసరాల్లో ఇంతటి భారీ ఎత్తుగల కట్టడానికి అధికారులు ఏ ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారంటూ న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆధునికఆకాశహర్మ్యాల వల్ల పురాతన చారిత్రక కట్టడాల ఉనికి కనుమరుగైపోతోందని, హెరిటేజ్ ల్యాండ్‌మార్క్‌లను పూర్తిగా కప్పివేసేలా అధిక అంతస్తుల భవనాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక హేతుబద్ధతఏమిటని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యతను కోర్టు గుర్తుచేసింది.అయితే, డెవలపర్ తరఫునహాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ సహా సంబంధిత అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి తాము అవసరమైన నిరభ్యంతర పత్రాలు , చట్టబద్ధమైన అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపట్టామని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. బిల్డర్ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కేవలం ఆరోపణలను ఖండించడానికి మాత్రమే పరిమితమైందని, ప్రాజెక్టు వల్లతలెత్తే తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ప్రమాదాలు, నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై ఎటువంటి సరైన సమాధానం ఇవ్వలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అన్ని నిబంధనలు పూర్తిగా నెరవేరే వరకునిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇదే సమయంలో, సదరు ప్రాజెక్టుపై ఇలాంటి ఆరోపణలతోనే గతంలో దాఖలైన మరో పిటిషన్ కూడా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని డెవలపర్ కౌన్సిల్‌కోర్టుకు తెలియజేస్తూ, ఆ రెండు అంశాలను కలిపి విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఆ రెండో పిటిషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి సమగ్ర వాదనలు వినిపించేందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది గడువు కోరారు. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను నమోదు చేసుకున్న హైకోర్టు బెంచ్.. ఆ పెండింగ్ కేసు నంబరు, వివరాలను జాబితా చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

# వల్లభనేని వంశీ 2.0.. మళ్లీ మొదలు పెట్టేసిన మాజీ ఎమ్మెల్యే!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** వైసీపీ కీలకనేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ తన పాత పంథాలో రాజకీయంగా దూకుడు చూపుతున్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చే బాధ్యతను భుజానికెత్తుకున్న వంశీ వరుసగా కేడర్ తో సమావేశాలు నిర్వహిస్తూ ధైర్యం నూరిపోస్తున్నారు. ఈ క్రమంలో ఊడత ఊపులకు తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తనకు భయం లేదని, తన అనుచరులు కూడా భయపడొద్దు అంటూ వంశీ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో వంశీ వరుసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం ద్వారా వంశీ కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయ్యారని చెబుతున్నారు. దీంతో కూటమి గెలిచిన వెంటనే ఆయన కొంత తగ్గినట్లు కనిపించినా, ప్రస్తుతం మళ్లీ పూర్తిస్థాయిలో రాజకీయాలు చేస్తూ తన దూకుడును కొనసాగిస్తున్నారని అంటున్నారు.

గన్నవరం నియోజకవర్గంలో వరుస కార్యక్రమాల్లో వంశీ చేస్తున్న వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రెండు రోజుల క్రితం తనను లోపల వేసిన వాడిని లోపలికి పంపిన నాయకుడు తనతో ఉన్నాడని చెబుతూ తనకు అండదండగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఉన్నారని, ఆయన కోసం తాను తెగించి పనిచేస్తానని స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు. ఇక తాజాగా కూడా మాజీ సీఎం జగన్ రెడ్డి గొప్పతనాన్ని చాటిచెబుతూ వంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన నాయకులు ముగ్గురే ఉన్నారని చెబుతూ, ఆ ఘనత సాధించిన నేతలుగా ఎన్టీఆర్, కేసీఆర్, జగన్ రెడ్డి పేర్లను ప్రస్తావించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎందరో పార్టీలు పెట్టినా అధికారంలోకి రాలేకపోయారని, కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం తన విస్తృత జనాకర్షణతో పార్టీని గెలిపించుకోగలిగారని వంశీ కొనియాడారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఇదే సమయంలో ఆయన బెదిరింపులకు లొంగేది లేదు అన్నట్లు చేసిన వ్యాఖ్యలు ఆగ్రహరాజేస్తున్నాయి. ఇప్పటికే పలు కేసుల ఎదుర్కొని, జైలుకు వెళ్లి వచ్చిన వంశీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పెద్దలను తన ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.తన విమర్శలకు సమాధానం చెప్పలేని విధంగా మాటల బాణాలు విసరడం ద్వారా ప్రజల్లో తన పట్ల సానుభూతి పెంచుకోవాలని వంశీ వ్యూహంగా ఉందని అంటున్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం మళ్లీ కేసులు నమోదు చేయించి అరెస్టు చేసేందుకు ప్రయత్నించినా, అది తనకు అనుకూలంగా మారుతుందని ఆయన భావిస్తున్నట్లుగా కనిపిస్తోందని అంటున్నారు. లేనిపక్షంలో తన మాటలతో వైసీపీ కార్యకర్తల్లో ఉత్తేజం నింపి ప్రభుత్వంపై దూకుడుగా పోటీ చేసేందుకు పనికొస్తుందన్న ఆలోచన కూడా ఉండొచ్చని అంటున్నారు. మొత్తానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని తాజా వ్యూహం రాజకీయంగా ఆసక్తి రేపుతోందని అంటున్నారు.

# మంత్రివర్గం రేసులో మహిళా నేత.. లక్కు చిక్కేనా ..!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు... స్థానిక సంస్థలే కాదు తన మంత్రివర్గంలోనూ బీసీలకు పెద్దపీట వేయాలని భావించారు. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు ఈ దఫా మంత్రులుగా అవకాశం కల్పించాలని ఇప్పటికే సమీక్షలు ప్రారంభించారు. అంతర్గతంగా పార్టీ సేకరించిన రిపోర్టులతో పాటు వ్యక్తిగతంగా చంద్రబాబు ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు నాయకుల పనితీరును చూసి వేసుకున్న అంచనాలను కూడా ఇప్పుడు సమీక్షిస్తున్నారు. తద్వారా నాయకులను మంత్రులుగా ఎంపిక చేసే విషయంపై దృష్టి పెట్టారు.దీనిలో ప్రధానంగా మహిళలకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. తద్వారా మహిళా ఓటు బ్యాంకు ను ఆకర్షించాలని చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో మెజారిటీ భాగం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం, ఆ వర్గం వైపు టిడిపి ఎక్కువగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఒక మహిళ ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఆవిడే గుంటూరు కు చెందిన గళ్ళ మాధవి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన మాధవి ఇటు పార్టీ పరంగా అటు వ్యక్తిగతంగా కూడా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం విషయంలో కానీ ప్రజలకు అందుబాటులో ఉండే విషయంలో కానీ మాధవి మంచి మార్కులు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ఆమెను పార్టీ పొలిట్ బ్యూరోలోకి కూడా తీసుకున్నారు. ప్రధానంగా వైసిపి నేతలపై విరుచుకు పడడంలో ఈ విధంగా కౌంటర్లు ఇవ్వడంలో కూడా మాధవి ముందున్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

ఈ క్రమంలోనే చంద్రబాబు సైతం ఆమె వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన మాధవికి మంత్రివర్గంలో అవకాశం కల్పించే విషయంపై చంద్రబాబు పరిశీలిస్తున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి అత్యంత విశ్వసనీయ సమాచారం వైరల్ గా మారింది. మాధవికి అన్ని అర్హతలు ఉన్నాయని, ఇటు ప్రజల్లోనూ అటు పార్టీలోనూ మంచి పేరు ఉందని సమస్యలపై స్పందిస్తున్నారని సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టడం అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలోనూ మాధవి నిరంతరం కృషి చేస్తున్నారని చంద్రబాబు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బీసీ సామాజిక వర్గంలో మరింత ఇమేజ్ పెంచుకునేందుకు మాధవికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నట్టు సీనియర్ నాయకుల మధ్య చర్చ సాగుతోంది. అదేవిధంగా ఈసారి రాయలసీమ నుంచి మరో మహిళను బీసీ సామాజిక కోటాలో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఉత్తరాంధ్ర నుంచి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళను కూడా తీసుకుంటారని అంటున్నారు మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

# రాష్ట్రపతి డిజిటల్ పేమెంట్.. సరస్ మేళాలో ద్రౌపది ముర్ము స్పెషల్ అట్రాక్షన్



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** సామాన్యుల నుంచి సంపన్నుల వరకు.. చిల్లర వ్యాపారి నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు.. నేడు దేశంలో ఎక్కడ చూసినా 'యూపీఐ పేమెంట్లు' సర్వసాధారణమైపోయాయి. రూపాయి బిళ్ల అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్క క్యూఆర్ కోడ్ స్కాన్ తో క్షణాల్లో చెల్లింపులు చేసే సాంకేతికత ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగమైంది. డిజిటల్ విప్లవంలో దేశ ప్రథమ పౌరురాలే స్వయంగా భాగస్వామ్యం కావడం విశేష ఆకర్షణగా నిలిచింది. విజయవాడలో జరుగుతున్న 'సరస్ మేళా'ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడ ఒక స్టాల్‌లో చీర కొనుగోలు చేసి, తన మొబైల్ ద్వారా యూపీఐ పద్ధతిలో నగదు చెల్లించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

విజయవాడ వేదికగా జరుగుతున్న జాతీయ సరస్ మేళా ప్రదర్శనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆమె ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒక స్టాల్‌లో తనకు నచ్చిన చీరను కొనుగోలు చేశారు. బిల్లు చెల్లించే సమయాన తన మొబైల్ ఫోన్ తీసి క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేశారు. యూపీఐ ద్వారా క్షణాల్లో చెల్లింపులు పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.దేశ సర్వోన్నత పీఠంలో ఉన్న రాష్ట్రపతి స్వయంగా డిజిటల్ పేమెంట్ చేయడం డిజిటల్ ఇండియా సాధిస్తున్న విజయానికి నిలువెత్తు నిదర్శనంగా చెబుతున్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆర్బీఐ కలిసి 2016 ఏప్రిల్ 11న యూపీఐ వ్యవస్థను ప్రారంభించాయి. కేవలం కొన్ని బ్యాంకులతో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫామ్ నేడు దేశ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ రియల్-టైమ్ లావాదేవీలలో దాదాపు 50% వాటా మన దేశానిదే కావడం విశేషంగా చెబుతున్నారు. ప్రతి నెలా వందల కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయి. చిన్న వ్యాపారులు, కూరగాయల అమ్మకందారుల నుంచి పెద్ద వ్యాపారాల వరకు ప్రతి లావాదేవీ డిజిటల్ రూపంలోనే సాగుతోంది.

యూపీఐ సాంకేతికత ఇక్కడితో ఆగడం లేదు. రాబోయే రోజుల్లో ఇది మరింత సంచలనాత్మక మార్పులు తేనుందని చెబుతున్నారు. ఏఐ ఆధారిత వాయిస్ కమాండ్ల ద్వారా మాటలతోనే సులువుగా చెల్లింపులు చేసే సదుపాయం రాబోతోందని నిపుణులు చెబుతున్నారు. సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, శ్రీలంక వంటి అనేక దేశాల్లో ఇప్పటికే యూపీఐ అందుబాటులోకి రాగా, భవిష్యత్తులో ప్రపంచమంతటా భారతీయులు కరెన్సీ మార్పిడి లేకుండా నేరుగా చెల్లింపులు చేయవచ్చు. అలాగే ఇంటర్నెట్ లేని మారుమూల ప్రాంతాల్లోనూ ఫీచర్ ఫోన్ల ద్వారా నేరుగా లావాదేవీలు జరిపేలా సాంకేతికత విస్తరిస్తోంది. విజయవాడ మేళాలో రాష్ట్రపతి డిజిటల్ చెల్లింపు చేయడం నుంచి గ్రామీణ మహిళలు క్యూఆర్ కోడ్ స్కానర్లు వాడడం వరకు.. భారత్ ఎంత వేగంగా డిజిటల్ వైపు అడుగులు వేస్తోందో స్పష్టమవుతోంది. ఆర్థిక పారదర్శకతకు, సులువైన జీవనానికి యూపీఐ వేసిన బాట భవిష్యత్తులో భారత్‌ను మరింత బలమైన డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చుతుందని అంటున్నారు.

# యార్లగడ్డ మాస్ రియాక్షన్.. గన్నవరం అప్పుడే గరం.. గరం..



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధానంగా కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ వేడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడ నగరంలో అంతర్భాగమైన గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న రాజకీయాలు మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ కొద్దిరోజులుగా హడావుడి చేస్తుండగా, ఆయనకు కౌంటరుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు రంగంలోకి దిగారు.స్థానిక ఎన్నికలకు వైసీపీ క్యాడర్ ను సన్నద్ధం చేసేందుకు వరుస సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తమ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డికి హైప్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు విషయాన్ని ఎత్తిచూపుతూ.. రెండు రోజుల క్రితం కీలక వ్యాఖ్యలు చేశారు. తనను లోపల వేసిన వారిని లోపలకు పంపిన వాడు తనతో ఉన్నాడంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అండదండలు ఉన్నాయని, తాను ఎవరికీ భయపడనని మాజీ ఎమ్మెల్యే వంశీ మాట్లాడిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే.ఇక వంశీ వ్యాఖ్యలపై గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు తీవ్రస్థాయిలో రియాక్ట్ అయ్యారు. వంశీ వెనక ఉన్నారని చెబుతున్న వ్యక్తే.. గతంలో అతడిపై తనను పోటీపెట్టాడని, వంశీ అరాచకాలను ఎదిరించాలని గన్నవరం టికెట్ ఇచ్చి పోటీకి పెట్టారని గుర్తు చేశారు. "నీ వెనుక ఉన్నవాడికి నీ గురించి తెలుసు.. నా గురించి తెలుసు. 2018లో బ్రహ్మలింగయ్య చెరువు ఒడ్డుమీద నీ వెనుక ఉన్నాయనే మట్టికాసుడు. రావణాసుడు, భూ బకాసురుడు అన్ని చెప్పిన వీడియో ఇప్పటికీ యూట్యూబ్ లో ఉంది. ఇప్పుడు అవన్నీ మరచిపోయి సుద్దపూస కబుర్లు చెబుతున్నావు" అంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ మండిపడ్డారు.మాజీ ఎమ్మెల్యే వంశీ అవినీతిపరుడు అని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తనను అమెరికా నుంచి తీసుకువచ్చి గన్నవరంలో పోటీ చేయమని కోరిన విషయం మరచిపోయావా? అంటూ ప్రశ్నించారు. బుద్ధి, జ్ఞానం లేకుండా నిర్లజ్జగా మాట్లాడుతున్నారని యార్లగడ్డ ఫైర్ అయ్యారు. ప్రస్తుతం యార్లగడ్డ రియాక్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం నియోజకవర్గం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉంది. ఇక్కడి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వంశీ గత ప్రభుత్వంలో వైసీపీలో చేరగా, అప్పుడు ఆయనపై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకటరావు 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు.

ఇక ఈ ఇద్దరు గత ఎన్నికల్లో మరోసారి ప్రత్యర్థులుగా తలపడగా, యార్లగడ్డ వెంకటరావు రికార్డు మెజార్టీతో గెలిచారు. అదేసమయంలో అంతకుముందు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడిన ఈ ఇద్దరు ఇప్పుడు తమ పార్టీలను పార్టీ అధినేతలను పొగుడుతూ ప్రత్యర్థి పార్టీల నేతలను విమర్శిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అప్పట్లో ఆయా పార్టీల అధినేతల మన్ననల కోసం పనిచేసిన నాయకులు ఇప్పుడు పార్టీలు మారి వారిపైనే విమర్శలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఈ క్రమంలోనే గతంలో టీడీపీలో పనిచేసిన వంశీ అప్పట్లో తనను నెంబర్ వన్ ఎమ్మెల్యే అంటూ పొగిడేవారని చెప్పుకోగా, అప్పట్లో ఆయనపై మాజీ సీఎం జగన్ చేసిన విమర్శలను కూడా గుర్తుచేస్తూ ఎమ్మెల్యే వెంకటరావు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయని చెబుతున్నారు.

# కూటమిలో కుంపటి.. టీడీపీకి జనసేన కొత్త టెన్షన్ పవన్ వ్యూహమేంటి?

**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన కూటమికి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. సీట్లు పంపకాల విషయంలో భాగస్వామ్యపక్షం జనసేన ఓ అడుగు ముందుకేసి దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 12శాతం సీట్లలో పోటీ చేసిన జనసేన ఇప్పుడు లోకల్‌బాడీల్లో 40శాతం సీట్లు కావాలని అడుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు.. ప్రభుత్వంలో భాగంగా ఉన్న మంత్రులు, ఆ పార్టీ నేతలు బహిరంగంగానే మాకు కావాలసిన సీట్లు ఇన్నీ.. అని లెక్కలేసి మరీ ప్రకటించేశారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేసిన ట్వీట్ కేవలం ఆయన అభిప్రాయంగా చెప్పలేం. అది కచ్చితంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాటనే. దుర్గేష్ జారీ చేసిన జాబితా చూస్తే.. జనసేన పక్కా వ్యూహంతోనే ఉన్నట్లుగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, వార్డుల స్థాయిలో మొత్తం స్థానాలను పరిగణనలోకి తీసుకుని.. సగటున 40 శాతం వాటాను జనసేన ప్రతిపాదిస్తున్నట్లుగా ఆ జాబితాలో చూపించారు. అందులో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ పదవులు, వార్డు కౌన్సిలర్ల స్థానాలు కూడా ఉన్నాయి. 6 మేయర్ స్థానాలు, 6 డిప్యూటీ మేయర్ స్థానాలు, 44 మునిసిపల్ ఛైర్మన్లు, దాదాపు 2000 వార్డు మెంబర్లు కౌన్సిలర్ స్థానాలు వీరు కోరుతున్నారు.లోకల్ ఎన్నికలకు సంబంధించి టీడీపీకి అస్సలు ఊహలో కూడా లేని నెంబర్ ఇది. ప్రధాన పదవుల్లో 42శాతం, మొత్తం మీద 40శాతం పదవులను జనసేన అడుగుతోంది. ఇప్పుడు వీళ్లు ఇన్ని అడిగితే.. బీజేపీ కూడా అసెంబ్లీ ఎన్నికల వాటా కంటే కచ్చితంగా ఎక్కువగానే అడిగే అవకాశం ఉంది. దీనిని బట్టి సగం స్థానాలను టీడీపీ మిత్రపక్షాలకు వదలాల్సి ఉంది. దీనికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారా..? టీడీపీ శ్రేణులు దీనికి సమ్మతిస్తాయా అన్నది అసలు ప్రశ్నజనసేన స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని అంచనా వేసి అభ్యర్థుల ఎంపికకు సిద్ధమవడం చూస్తే.. ఈసారి సీట్ల పంపకాలను తేలిగ్గా వదిలేయడానికి ఆ పార్టీ సిద్ధంగా లేదని అర్థమవుతోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములానే స్థానిక ఎన్నికలకూ వర్తింపజేయలేమని జనసేన నేత నాదెండ్ల మనోహర్ చాన్నాళ్ల క్రితమే చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసి అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఆ విజయంలో మూడు పార్టీల పాత్ర ఉన్నప్పటికీ, అసెంబ్లీ స్థానాల పరంగా టీడీపీ ప్రధాన భాగస్వామిగా నిలిచింది. ఇప్పుడు స్థానిక ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి సమీకరణాలు మారుతున్నాయి. అప్పుడు జనసేనకు 12శాతం, బీజేపీకి 6శాతం సీట్లు ఇచ్చిన టీడీపీ 80కి పైగా స్థానాల్లో పోటీ చేసింది. అయితే అది ఇప్పుడు కుదరదు అని జనసేన తేల్చేసింది. టీడీపీపై ఒత్తిడి పెంచడానికి ముందు నుంచే ఎక్కువ సీట్లు కావాలని చెబుతోంది. ఇప్పటికే సీట్లు పంపకాలపై మూడు సార్లు సమావేశమైనప్పటికీ ఏ విషయం తేలలేదు. అంతేకాదు.. తమకు ఎన్నిసీట్లు కావాలో నేరుగా ఆన్‌లైన్‌లో పెట్టేయడం ద్వారా జనసేన ఇప్పుడు బాల్‌ను టీడీపీ కోర్టులోకి నెట్టేసింది. ఇప్పటి వరకూ కూటమిలో ఉన్న పొరపొచ్చాలను బయటకు రాకుండ సర్దుబాటు చేసుకుంటూ వస్తున్న చంద్రబాబుకు ఇది కచ్చితంగా కాస్త ఇబ్బంది కరమే..ప్రస్తుత పరిస్థితిని పవన్ కల్యాణ్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. టీడీపీతో పొత్తు కారణంగా జనసేనకు అధికారంలో భాగస్వామ్యం లభించింది. కానీ స్థానిక సంస్థల్లోనూ పార్టీకి తగిన ప్రాతినిధ్యం లేకపోతే, కేడర్‌లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికలను జనసేన తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశంగా దీనిని చూస్తుందనుకోవచ్చు. 40 శాతం వాటా ప్రతిపాదనపై కనుక ఆ పార్టీ సీరియస్‌గా నిలబడితే.. అది సాధారణ సీట్ల పంపకాల చర్చ కంటే పెద్ద రాజకీయ సంకేతమే అవుతుంది. లోకల్ బాడీ ఎన్నికల్లో పెద్ద వాటా తీసుకునేందుకే క్రమంగా జనసేన తమ నేరేటివ్‌ను బలపరుచుకుంటూ వచ్చింది. ముందుగా అంతర్గత కమిటీలు వేసి తమ పార్టీలో బలం ఎంత ఉంది.. ఎక్కడెక్కడ డిమాండ్ ఉందన్న విషయాన్ని చెప్పారు. ఆ తర్వాత నాదెండ్ల మనోహర్ తమ వైఖరి ఏంటో తెగ్గొట్టేశారు. ఇప్పుడు సరైన టైమ్‌లో "మాకు ఇన్నిసీట్లు కావాలి" అని తేల్చేశారు. పవన్ చాలా పకడ్బందీగా ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు కనిపిస్తోంది.పవన్ కల్యాణ్- లోకేష్ పరస్పరం ఎంత సఖ్యతతో ఉంటారన్నది చాలా సార్లు కనిపించింది. అయితే వారిద్దరి మధ్య వచ్చిన కమ్యూనికేషన్ గ్యాప్.. కూటమిలో కాస్త వేడిపుట్టించిందని సమాచారం. ఈ మధ్య కాలంలో పనవ్ కల్యాణ్ కూటమి నేతలతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం, లోకేశ్‌తో దూరం పెరుగుతోందన్న చర్చలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నా.. వీటిని నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు కనిపించడం లేదు. కానీ ఎక్కడో తేడా వచ్చిందనే మాటలైతే.. వినిపిస్తున్నాయి.

## విజయ్ పర్యటనలో పవన్ కల్యాణ్ మిస్సింగ్

తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రిజర్వేషన్లపై టీడీపీ, జనసేన మధ్య" సోషల్" వార్




ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అగ్రనేతల మధ్య సయోధ్య ఉంది. అయితే ఇదే సమయంలో కింది స్థాయి నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉందన్నది స్పష్టంగా అర్థమవుతుంది. సోషల్ మీడియాలో రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు మాటల యుద్ధం చూస్తేనే ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రధానంగా జనసేన పోటీ చేయాలనుకున్న, కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇతరులకు కేటాయించడంపై జనసైనికులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేసిందని టీడీపీ ఎదురుదాడికి దిగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారు అంశంపై తెలుగుదేశం పార్టీ , జనసేనపార్టీల సోషల్ మీడియా శ్రేణుల మధ్య తీవ్రమైన వార్ నడుస్తోంది. పార్టీని ఎదగకుండా చేయడానికి ఈ ఎత్తువేశారని జనసేన కార్యకర్తలు బహిరంగంగానే చెబుతున్నారు.

**వివాదానికి ప్రధాన కారణాలివే...**

క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ నేతల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, రిజర్వేషన్ల ప్రకటనతో సీట్ల సమీకరణాలు మారడం సోషల్ మీడియాలో వివాదానికి కారణమైంది. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రకటన తర్వాత జనసేన ఆశిస్తున్న సీట్ల లెక్కల్లో మార్పులు వచ్చాయి. రిజర్వేషన్ల కేటాయింపులపై జనసేన అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రెండు పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. టీడీపీ శ్రేణులు గతంలో నాగబాబు వంటి జనసేన నాయకులు చంద్రబాబుపై చేసిన విమర్శల వీడియోలను బయటకు తీస్తుండగా, జనసేన శ్రేణులు పవన్ కళ్యాణ్, చిరంజీవిలపై గతంలో టీడీపీ నేతలు చేసిన వ్యాఖ్యల వీడియోలను వైరల్ చేస్తున్నారు. కాకినాడ, రాజమండ్రి వంటి చోట రిజర్వేషన్ల ఖరారును తపపుపడుతున్నారు. కొందరు జనసేన కార్యకర్తలు ఎన్టీఆర్, చంద్రబాబు, నారా లోకేశ్ లను లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెడుతుండగా, ప్రతిచర్యగా టీడీపీ మద్దతుదారులు మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.

**దిద్దుబాటు చర్యల్లో అధిష్టానం...**

ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉండటంతో రెండు పార్టీల అధినేతలు అలర్ట్ అయ్యారు.వ్యక్తిగత కోపతాపాలు, ఎమోషన్స్‌తో పార్టీ లైన్ దాటి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, ఇది కూటమి స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఇరు పార్టీల అధిష్టానాలు తమ కార్యకర్తలకు స్పష్టం చేశాయి.: సోషల్ మీడియాలో తలెత్తుతున్న వివాదాలను, ఒకరినొకరు టార్గెట్ చేసుకునే ధోరణిని అదుపు చేయడానికి రెండు పార్టీలు ప్రత్యేక సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాయి. మనలో మనకు గొడవలు వద్దని, ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి అయిన వైసీపీ పైనే దృష్టి పెట్టాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని క్యాడర్‌కు సూచించారు. అయితే కార్యకర్తల్లో మాత్రం అసహనం ఆగడం లేదు. కావాలని రిజర్వేషన్లను ప్రభుత్వం పెద్దలు జనసేనలో ఒక వర్గానికి దక్కనివ్వకుండా చేయడానికే ఇటువంటి ప్రయత్నాలు చేశారంటున్నారు. మొత్తం మీద రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం రేపటి ఎన్నికల్లో దెబ్బతీస్తుందేమోనన్న ఆందోళన నెలకొంది.

# తండ్రి పేరు చెడగొడతున్నావు కదయ్యా? ఎన్ని పార్టీలు మారతావు?




వంగవీటి రాధాకృష్ణ మరోసారి పార్టీని మారారు. అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. తాజా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విజయవాడ మేయర్ అభ్యర్థిత్వం లేదా సీట్ల సర్దుబాటు చర్చల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఆయన రాజకీయ ప్రస్థానాన్ని గమనిస్తే, గత రెండు దశాబ్దాలుగా మారుతున్న రాజకీయ సమీకరణాలు, టికెట్ల కేటాయింపులు, నాయకత్వంతో విభేదాల వల్లే ఆయన ఐదు పార్టీలు మారాల్సి వచ్చింది. వంగవీటి రాధా రాజకీయ ప్రయాణం పై అనేక విమర్శలు సొంత సామాజికవర్గం నుంచి వినిపిస్తున్నాయి. వంగవీటి రాధా కృష్ణ తన తండ్రి రంగా పేరును చెడగొడుతున్నారన్న భావన వారి అనుచరుల్లోనూ వ్యక్తమవుతుంది. ఉన్న పార్టీలో పట్టుబట్టి, జనంలో తిరిగి పదవులు సంపాదించుకోవాలి కానీ, పదవుల కోసం పార్టీలు మారుతూ పరువు పోకొడుతున్నారన్న కామెంట్స్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తున్నాయి.

**ఒక్కసారి గెలిచి...**

వంగవీటి రాధా కృష్ణ తన తల్లి రత్నకుమారి నుంచి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకని పాలిటిక్స్ లోకి వచ్చారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరారు. అప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి వంగవీటి రాధ విజయం సాధించి తొలిసారి శాసనసభలోకి అ్నగుపెట్టారు. అదే చివరి గెలుపు. చివరి పదవి. తర్వాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అక్కడ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం వైసీపీలోకి వంగవీటి రాధా చేరారు. అక్కడా ఓటమిని చవి చూశారు. తర్వాత టీడీపీలో చేరి తన అదృష్టాన్ని పరిశీలించుకోవాలనుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరినప్పటికీ ఆయనకు ఎక్కడా పోటీ చేసేందుకు కూడా అవకాశం లభించలేదు. దీంతో వంగవీటి రాధ గత కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. జనాల్లో కూడా కలవడం లేదు. వంగవీటి రంగా జయంతి, వర్థంతి కార్యక్రమాలకు తప్ప ఎక్కడా కనిపించడం లేదు. టీడీపీలో ఎమ్మెల్సీ పదవి వస్తుందని భావించినా అది దక్కలేదు. దీంతో ఆయన చివరకు జనసేనలో చేరడం ఇప్పుడు బెజవాడ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

**ఇదేమి రాజకీయం?**

విజయవాడ రాజకీయాల్లో వంగవీటి మోహన రంగా వారసుడిగా రాధాకు బలమైన కాపు సామాజికవర్గ మద్దతు మరియు అనుచరగణం ఉంది. కానీ స్థిరమైన వ్యూహం లేకపోవడం, సరైన సమయంలో సరైన స్థానం దక్కకపోవడమే ఆయన తరచూ పార్టీలు మారడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం లో ఉన్నందున, మిత్రపక్షమైన జనసేన ద్వారా తన రాజకీయ భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలని ఆయన భావిస్తున్నారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ను కలవడం, తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో భేటీ అవ్వడంతో ఆయన పార్టీ మారతారన్న ఊహాగానాలు చాలా రోజుల నుంచి వినిపించాయి. అయితే నిన్న అధికారికంగా జనసేన కండువా కప్పుకున్నారు. మరి విజయవాడ మేయర్ గా పోటీ చేయాలని వంగవీటి రాధ భావిస్తున్నారు. ఈ తాజా మార్పు ఆయన రాజకీయ జీవితానికి ఎంతవరకు కలిసివస్తుందో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే తేల్చాల్సి ఉంది. కానీ వంగవీటి రాధ మాత్రం ఐదు పార్టీల మారడాన్ని మాత్రం సొంత అనుచరులే తప్పుపడుతున్నారు. మరి వంగవీటి రాధను విజయవాడ ప్రజలు ఆదరిస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# దుర్గాదేవి వాహనం సింహమే ఎందుకో తెలుసా?




నవరాత్రి సందర్భంగా దుర్గామాతను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. పురాణాల్లో నవదుర్గల వివిధ రూపాలకు వేర్వేరు వాహనాలు ఉన్నట్లు వివరించబడింది. ఉదాహరణకు శైలపుత్రి దేవి వృషభంపై విహరిస్తే,కాలరాత్రి దేవి గాడిదపై విహరిస్తుంది. ఈ విధంగా ప్రతి దేవికి ప్రత్యేకమైన వాహనం ఉందిలి. అయితే, దుర్గామాతకు ప్రధాన వాహనం సింహమే. దుర్గాదేవి సింహంపై విహరిస్తుంది. అలాగే పార్వతీదేవిని కూడా సింహం పై విహరిస్తున్నట్లు చిత్రిస్తారు. పార్వతీదేవి కుమారుడైన కార్తికేయుడిని స్కందుడు అని కూడా పిలుస్తారు. అందువల్ల ఆమెను స్కందమాత అని అంటారు. స్కందమాతను సింహంపై విహరిస్తున్నట్లు చూపిస్తారు. అలాగే కాత్యాయనీ దేవిని కూడా సింహంపై విహరిస్తున్నట్లు చిత్రిస్తారు. కుష్మాండా దేవి సింహం వాహనంపై విహరిస్తుంది. చంద్రఘంటా దేవి కూడా సింహం పైనే విహరిస్తుంది. ప్రతిపద తిథిన పూజించే శైలపుత్రి దేవి, అష్టమి రోజున పూజించే మహాగౌరీ దేవి మాత్రం వృషభంపై విహరిస్తారు. కాలరాత్రి దేవి వాహనం గాడిద కాగా, సిద్ధిదాత్రి దేవి కమలాసనంపై విరాజిల్లుతుంది.

**పురాణాల కథనం ప్రకారం...**

ఒక పురాణకథ ప్రకారం, పరమేశ్వరుడిని భర్తగా పొందేందుకు పార్వతీదేవి వేలాది సంవత్సరాలు ఘోర తపస్సు చేసింది. ఆ తపస్సు కారణంగా ఆమె శ్యామలవర్ణంగా మారింది. అనంతరం శివపార్వతుల వివాహం జరిగింది. ఒకరోజు ఇద్దరూ కలిసి కూర్చొని ఉండగా, పరమేశ్వరుడు సరదాగా పార్వతీదేవిని "కాళీ" అని సంబోధించాడు. ఆ మాట పార్వతీదేవికి బాధ కలిగించింది. వెంటనే ఆమె కైలాసాన్ని విడిచి వెళ్లి మరలా తపస్సులో నిమగ్నమైంది.అదే సమయంలో ఆకలితో ఉన్న ఒక సింహం ఆమెను తినాలనే ఉద్దేశంతో అక్కడికి వచ్చింది. కానీ తపస్సులో పూర్తిగా లీనమైన పార్వతీదేవిని చూసి నిశ్శబ్దంగా అక్కడే కూర్చుంది. "దేవి ఎప్పుడు తపస్సు ముగించి లేస్తుందో, అప్పుడు ఆమెను ఆహారంగా చేసుకుందాం" అని సింహం అనుకుంది. ఇలా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయినా, ఆ సింహం అక్కడి నుంచి కదల్లేదు.చివరకు పార్వతీదేవి తపస్సు పూర్తికాగానే పరమేశ్వరుడు ప్రత్యక్షమై, ఆమెకు గౌరవర్ణం (తెల్లని కాంతివర్ణం) కలగాలని వరం ప్రసాదించాడు.

**అందుకే సింహవాహనం...**

ఆ తరువాత పార్వతీదేవి గంగానదిలో స్నానం చేయగా, ఆమె శరీరం నుండి ఒక శ్యామలవర్ణ దేవి ఆవిర్భవించింది. ఆ దేవిని కౌశికీ దేవి అని పిలిచారు. గౌరవర్ణాన్ని పొందిన పార్వతీదేవి గౌరీదేవిగా ప్రసిద్ధి చెందింది.తనను తినేందుకు ఎదురుచూస్తూ సంవత్సరాల తరబడి తనపైనే దృష్టి నిలిపి ఉన్న ఆ సింహాన్ని పార్వతీదేవి తన వాహనంగా స్వీకరించింది. ఎందుకంటే, తనను తినాలనే ఉద్దేశంతో వచ్చినా, ఎన్నో సంవత్సరాలు తనపై ఏకాగ్రచిత్తంతో దృష్టి నిలిపి ఉండటం కూడా ఒక విధమైన తపస్సేనని ఆమె భావించింది. ఆ సింహం చేసిన ఆ తపస్సును గౌరవించి, తన సేవలోకి తీసుకుంది. అందువల్లే పార్వతీదేవి వాహనంగా సింహం ప్రసిద్ధి చెందింది

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. దసరా సెలవుల్లో ఇదేంటి?




తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. గతంతో పోల్చుకుంటే నేడు తిరుమలలో ఓ మోస్తారుగా భక్తుల రద్దీ ఉంది. తిరుమలకు బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల సంఖ్య తక్కువగా ఉండటంతో భక్తులు ఏడుకొండలవాడిని సులువుగా దర్శించుకుంటున్నారు. బయట వరకూ క్యూ లైన్లు నిండటం లేదు. కంపార్ట్ మెంట్లలోనే భక్తులు వేచి ఉంటున్నారు. ఇదే సమయంలో భక్తుల సంఖ్య దసరా సెలవుల సందర్భంగా పెరుగుతుందని భావించి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తులు తక్కువ సంఖ్యలో రావడంతో వసతి గృహాలు కూడా సులువుగానే లభిస్తున్నాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**భక్తుల రద్దీ అంతగా లేదు...**

తిరుమలలో మాడవీధుల నుంచి లడ్డూ ప్రసాదాల విక్రయాల కేంద్రాల వరకూ, అన్న ప్రసాదం కోసం కూడా భక్తులు అధిక సంఖ్యలో కనిపిస్తారు. అలాంటిది గత కొన్ని రోజుల నుంచి భక్తుల సంఖ్య తక్కువగా ఉంది. ముందుగా టిక్కెట్లను కొనుగోలు చేసిన భక్తులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మాత్రమే తిరుమలను దర్శించుకుని ఏడు కొండల వాడిని దర్శించుకుంటున్నారని, గరుడ వాహన సేవ రోజు మాత్రం లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని భావించి, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని, అనేక ఆంక్షలు కూడా తిరుమలలో విధించామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చెబుతున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం కూడా నవరాత్రుల్లో ఆశించినంతగా రావడం లేదు.

**ఎనిమిది గంటల్లో...**

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 27 కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు.శ్రీవారి సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఎనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు రెండుగంటల్లో దర్శనం పూర్తవుతుంది. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 84,289 గా ఉంది. శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తులు 31,474 గా ఉన్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.33 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 4.53 లక్షలు జరిగాయని, తిరుమలలో అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులు రెండు లక్షల మంది స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రకటనలు చూసి మోసపోకండి... బంగారాన్ని అమ్మేయకండి

బంగారం ధరలు తాకట్టు పెట్టొద్దు.. అమ్మమని కొందరు. పాత బంగారం ఇచ్చి కొన్ని నెలల తర్వాత కొత్త నగలు తీసుకొమ్మని మరికొందరు ప్రకటనలు చేస్తూ కొనుగోలుదారులను అయోమయానికి గురి చేస్తున్నారు. ఇటువంటి ప్రకటనలతో బంగారం, వెండి ధరలు రానున్న కాలంలో పెరుగుతాయన్న అనుమానం అందరిలోనూ కలుగుతుం ది. అయితే ఇటువంటి ప్రకటనలను నమ్మకుండా అవసరమైతే తప్ప బంగారం, వెండి నగలు అమ్మవద్దని పలువురు మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. వ్యాపార ప్రకటనలు చూసి మోసపోవద్దని, పాత బంగారానికి విలువెక్కువ. కొత్త బంగారానికి మెరుగు ఎక్కువ. అందుకే ఇలాంటి ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూ కొనుగోలుదారులను దోచుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.




**తప్పుదోవ పట్టించే విధంగా...**

డబ్బు అవసరమైతే తమ ఆర్థిక ఇబ్బందులకు తగినట్లుగా బంగారాన్ని కుదువ పెట్టడమో, అమ్మడమో ఎవరైనా చేస్తారు. అంతే తప్ప బంగారాన్ని తాకట్టు పెట్టడమే భారంగ చిత్రీకరించడమేంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. బంగారాన్ని నిజంగా అమ్మకోవాలంటే తమ వద్ద నాణ్యమైన బంగారు ఆభరణాలు దొరుకుతాయని, తక్కువ ధరకు ఇస్తున్నామని ఆఫర్లు ఇవ్వాలి కాని, ఇలా అమాయక ప్రజలను మోస పుచ్చే ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పాత బంగారానికి విలువెక్కువ. కొత్త బంగారానికి మెరుపు ఎక్కువ. అందుకే ఇలాంటి ప్రకటనలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దంటూ కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

**నష్టం తెచ్చి పెట్టని పసడి...**

బంగారం, వెండి ధరలు ఎప్పుడూ పెరుగుతుంటాయి. అవి నష్టం తెచ్చే పెట్టే అవకాశమే లేదు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బంగారాన్ని అమ్మవద్దని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. రానున్న కొద్ది కాలంలో పది గ్రాముల బంగారం ధర రెండు లక్షల రూపాయలు అవుతుందని చెబుతున్నారు. అందుకే భద్రంగా దాచుకుంటే భవతకు బంగారమేనని చెబుతున్నారు.

ఈరోజు దేశంలో బంగారం ధరలు తగ్గాయి. వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి ధరపై వంద రూపాయలు తగ్గింది. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,35,890 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,48,250 రూపాయలుగా కొనసాగుతుంది. కిలో వెండి ధర 2,34,900 రూపాయల వద్ద ట్రేడ్ అవుతుంది.

# రూపాయికి కవచం!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా, అంటే దేశ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థల అధిపతులు, మార్కెట్లలో అతిగా ఒడుదొడుకులు, ఊహాజనిత లావాదేవీలు చోటుచేసుకోకుండా రూపాయికి కేంద్ర బ్యాంక్ అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. రూపాయికి ఏదోక నిర్దిష్ట స్థాయిని, శ్రేణిని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోలేదని మల్హోత్రా స్పష్టం చేయగా, గత ఏడాదిన్నరలో రూపాయి "చాలా గణనీయంగా" బలహీనపడిందని, అందుకు ప్రపంచ అనిశ్చితులే కారణమని, విదేశీ మారక నిల్వలు సహా దేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని సీతారామన్ అన్నారు. అంకెలు ఈ ఒత్తిడిని చూపుతున్నాయి. ఈ ఏప్రిల్ 1 నుంచి రూపాయి 2.8 శాతం బలహీనపడి, ప్రధాన ఆసియా ఆర్థిక వ్యవస్థల కరెన్సీల్లో రెండో అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది; ఇదే కాలంలో ఇండోనేషియా రూపయా 6 శాతం పడి, ఆసియాలో అత్యంత బలహీన కరెన్సీగా నిలిచింది. ఈ ఏడాది ఆరంభం నుంచి లెక్కిస్తే రూపాయి 7 శాతానికి పైగా క్షీణించింది. అక్టోబర్ 10న ఆర్‌బీఐ ప్రకటించిన చర్యలు అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చాయి. రూపాయి కుదురుకోవడానికి అవి సహాయపడుతున్నాయి: ఈ వారం ఇప్పటికే సుమారు 1.7 శాతం కోలుకుని, బుధవారం డాలర్‌కు 95.16 వద్ద, ఒక నెలలో అత్యధిక స్థాయిలో ముగిసింది. ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ అనే మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల రోజువారీ డాలర్ అవసరాలన్నింటినీ తీర్చేందుకు ఆర్‌బీఐ ప్రత్యేక కిటికీని తెరిచింది; ఇది తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతుంది. రద్దయిన విదేశీ మారక డెరివేటివ్ ఒప్పందాలను మళ్లీ బుక్ చేయడంపై ఆంక్షలు విధించింది; అంతర్లీన లావాదేవీ లేకుండా చేసే ఒప్పందాల పరిమితిని తగ్గించింది; అర్హత గల డెరివేటివ్ ఒప్పందాల కోసం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ రిస్క్ రిజర్వ్' (ఎఫ్‌ఈఆర్‌ఆర్) పేరుతో కొత్త నగదు నిల్వ అవసరాన్ని ప్రవేశపెట్టింది, అంటే 20 శాతం నగదు రిజర్వ్, నిర్దిష్ట పరిమితికి మించిన ఒప్పందాలకు. సోమవారం రాత్రి విడుదల చేసిన మరో సర్క్యులర్‌లో, నివాసేతరులకు అందించే రూపాయి నాన్-డెలివరబుల్ డెరివేటివ్‌లను కేవలం హెడ్జింగ్‌కు మాత్రమే పరిమితం చేసింది, బ్యాంకుల సొంత హెడ్జింగ్ ఒప్పందాలకు కూడా ఎఫ్‌ఈఆర్‌ఆర్‌ను విస్తరించింది.

ఈ చర్యలు సహేతుకమైనవే. ఊహాజనిత లావాదేవీల ఖర్చు పెంచడం, చమురు కంపెనీల భారీ డాలర్ డిమాండ్‌ను స్పాట్ మార్కెట్ నుంచి వేరు చేయడం ద్వారా ఆర్‌బీఐ మార్కెట్లలో క్రమశిక్షణ తెచ్చింది. అంచనాలు ఏకపక్షంగా, అంటే రూపాయి నిరంతరం పడిపోతుందనే నమ్మకంతో, మారినప్పుడు ఇలాంటి చర్యలు అవసరమవుతాయి. కానీ ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. కరెన్సీ నష్టాల నుంచి తమను తాము రక్షించుకుంటున్న వ్యాపారాలను, మరింత క్షీణత భయంతో హెడ్జ్ చేస్తున్నారన్న కారణంతో, ఊహాజనిత వ్యాపారులుగా చూడకూడదు. నిబంధనలు కఠినమైనప్పుడు నిజమైన హెడ్జర్లకు అదనపు ఖర్చు, పత్రాల భారం పడే ప్రమాదం ఉంది. ఈ చర్యల ప్రభావం బ్యాంకులపైనా పడుతోంది: బ్యాంకుల సొంత హెడ్జింగ్ ఒప్పందాలకు కూడా నగదు నిల్వ నిబంధన విస్తరించడం ద్రవ్యలభ్యతపై ఆందోళనలకు దారితీసిందని నివేదికలు చెబుతున్నాయి. అదే సమయంలో, మార్కెట్లు ఇప్పుడు వచ్చే 12 నెలల్లో దాదాపు 100 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల పెంపును అంచనా వేస్తున్నాయి. అదనపు చర్యలకూ సిద్ధంగా ఉన్నామని మల్హోత్రా చెప్పగా, ఆర్‌బీఐ మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని సీతారామన్ అన్నారు. ఇది కొత్తేం కాదు. 2013లో రూపాయి కనిష్ఠానికి (డాలర్‌కు 68.85) పడినప్పుడు కూడా ఆర్‌బీఐ ఇదే తరహాలో చమురు కంపెనీలకు ప్రత్యేక స్వాప్ కిటికీ తెరిచింది; అవి రూపాయిని తాత్కాలికంగా కుదుటపరిచాయి. కానీ అవి సమస్య మూలాలను తొలగించలేదు, అప్పటి పరిస్థితికి కారణమైన కరెంట్ ఖాతా లోటు, ఎగుమతుల బలహీనత వంటి నిర్మాణాత్మక అంశాలు మరో రూపంలో తిరిగి వచ్చే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ చర్యలు రూపాయికి తాత్కాలిక కవచం మాత్రమే, ఎందుకంటే అసలు ఒత్తిడి దేశంలో కంటే బయటి నుంచి, ముఖ్యంగా చమురు నుంచి వస్తోంది.

ఆ నేపథ్యాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు, నౌకలపై దాడులు, హూతీల దాడులతో బ్రెంట్ ముడిచమురు ధర ఈ వారం బ్యారెల్‌కు 106 డాలర్లకు పైగా చేరింది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటుంది; ప్రతి డాలర్ పెరుగుదల వార్షిక దిగుమతి బిల్లును సుమారు రెండు బిలియన్ డాలర్లు పెంచుతుందని అంచనా. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ముడిచమురు దిగుమతుల బిల్లు 61 శాతం పెరిగి 49.8 బిలియన్ డాలర్లకు, ఏప్రిల్-ఆగస్టులో 48 శాతం పెరిగి 74.8 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే డాలర్లకు డిమాండ్ నిర్మాణాత్మకంగా పెరిగింది. ఈ ఒత్తిడిలో విదేశీ మారక నిల్వలు వరుసగా నాలుగు వారాలు తగ్గి, అక్టోబర్ 2 నాటికి 734.6 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ద్రవ్యోల్బణం కూడా ఎగబాకుతోంది: సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది, ఉల్లి ధరలు రెట్టింపయ్యాయి; ఇది 22 నెలల గరిష్ఠం, వరుసగా నాలుగో నెల ఆర్‌బీఐ 4 శాతం లక్ష్యానికి పైన ఉంది. 2026-27కు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనా 5.2 శాతం, వృద్ధి అంచనా 7.1 శాతం; డిసెంబర్‌లో మరో రేట్ల పెంపు ఉండవచ్చని హెచ్‌ఎస్‌బీసీ అంచనా వేస్తోంది. అందుకే ఆర్‌బీఐ చర్యలు, శాశ్వత ఆర్థిక సంస్కరణలతో కలిసి సాగాలి. ప్రభుత్వం ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే చర్యలను వేగవంతం చేయాలి: పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, దేశీయ చమురు, గ్యాస్ ఉత్పత్తి, వ్యూహాత్మక నిల్వలు. ఎగుమతుల పోటీతత్వాన్ని పెంచి, వాణిజ్య ఒప్పందాల ద్వారా కొత్త మార్కెట్లను తెరిచి, డాలర్ ఆదాయాన్ని పెంచుకోవాలి. దీర్ఘకాలిక ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులపై ఆధారపడాలి. ఇంధన ధరల భారాన్ని తగ్గించేందుకు సబ్సిడీలు, పన్నులపై తీసుకునే నిర్ణయాలు ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీయకుండా ఉండాలి; ద్రవ్య లోటును అదుపులో ఉంచాలి, ఎందుకంటే ప్రభుత్వ ఆర్థిక స్థితిపై అనుమానాలు కరెన్సీపై ఒత్తిడిని పెంచుతాయి. స్వల్పకాలంలో ఆర్‌బీఐ కవచం రూపాయిని కాపాడగలదు, కానీ దీర్ఘకాలంలో రూపాయి బలాన్ని నిర్ణయించేది దేశ ఆర్థిక మూలాలే. కవచం తాత్కాలికమని, సంస్కరణలే శాశ్వత రక్షణ అని పాలకులు గుర్తిస్తేనే ఈ ఒత్తిడి నుంచి దేశం బలంగా బయటపడుతుంది.

## పనికొచ్చే పలుకు



# కోటీశ్వరుల అలవాట్లు రీల్స్‌లో కాదు, రొటీన్స్‌లో

"ఈ ఒక్క ట్రిక్‌తో ఆరు నెలల్లో కోటీశ్వరుడు అవ్వండి!" థంబ్‌నెయిల్‌లో కారు పక్కన నిలబడిన అన్న, కింద "లింక్ బయోలో ఉంది". చూసినవాడు "ఇదేదో బాగుందే" అనుకుంటాడు. కానీ నిజమైన కోటీశ్వరులు రీల్ తీసే టైమ్‌లో ఏం చేస్తారో తెలుసా? చాలామంది ఆర్థిక నిపుణులు చెప్పే ఆ అలవాట్లు చాలా బోరింగ్‌గా ఉంటాయి. అందుకే అవి వైరల్ అవ్వవు.

పుస్తకాలు, ఉదయం నిద్ర లేవడం: ఎక్కువ చదివేవారికి కొత్త ఆలోచనలు, తప్పులను ముందే గుర్తించే సామర్థ్యం పెరుగుతాయి. ఉదయాన్నే లేచేవారికి ఫోన్ నోటిఫికేషన్లు రాకముందే ఒక గంట సొంతంగా దొరుకుతుంది. ఆ గంటలో నేర్చుకోండి, ప్లాన్ చేయండి, వ్యాయామం చేయండి. ఇదేం మ్యాజిక్ కాదు, రోజువారీ అలవాటు.

ముందు పొదుపు, తర్వాత ఖర్చు: చాలామంది నెలాఖరులో మిగిలినది పొదుపు చేద్దాం అనుకుంటారు. కానీ ఎప్పుడూ ఏమీ మిగలదు. అందుకే జీతం రాగానే ముందు పొదుపు/పెట్టుబడికి వేరు చేయండి, మిగిలినదే ఖర్చు చేయండి. సంపాదన కంటే తక్కువ ఖర్చుతో బతకడమంటే పిసినారితనం కాదు, భవిష్యత్తుకు స్థలం ఇవ్వడం.

చక్రవడ్డీ, నెమ్మదిగా పనిచేసే పవర్: ఇదొక ఊహాత్మక ఉదాహరణ (హామీ కాదు). నెలకు రూ.5వేల చొప్పున 20 ఏళ్లు పెట్టుబడి పెట్టి, ఏటా సగటున 10 శాతం రాబడి వచ్చిందనుకుంటే, సుమారు రూ.38 లక్షలవుతుంది. మీరు పెట్టింది మాత్రం రూ.12 లక్షలే. మిగిలినది సమయం, చక్రవడ్డీ చేసిన పని. కానీ ఇక్కడ ఒక షరతు, ఆగకుండా, ఏళ్ల తరబడి కొనసాగించాలి. మార్కెట్ రాబడులు ఏటా మారొచ్చు. నష్టాల సంవత్సరాలూ ఉంటాయి. అందుకే ఓపిక ముఖ్యం.

లెక్క చూసుకోవడం: ఆదాయం, ఖర్చులు, పెట్టుబడులను నెలకు ఒకసారి చూసుకోండి. ఇది పది నిమిషాల పని. ఎక్కడ డబ్బు లీక్ అవుతోందో, ఏ సబ్‌స్క్రిప్షన్ అనవసరమో అప్పుడే తెలుస్తుంది. లెక్క చూడనివాడికి బ్యాలెన్స్ ఎప్పుడూ ఆశ్చర్యమే.

ఈ అలవాట్లు లైఫ్‌స్టయిల్‌ను ఎలా మారుస్తాయి?

ఈ చిన్న అలవాట్లు కలిస్తే ఒత్తిడి తగ్గుతుంది, ఎందుకంటే అత్యవసరం వస్తే చేతిలో డబ్బు ఉంటుంది. అనవసర షాపింగ్ తగ్గుతుంది. "ఇంకా కావాలి" అనే కోరిక కంటే "ఇది నాకు నిజంగా అవసరమా?" అనే ప్రశ్న ముందుకొస్తుంది. భవిష్యత్తు గురించి భయం బదులు నియంత్రణ ఉన్నట్టు అనిపిస్తుంది.

అన్నీ ఒకేసారి వద్దు. ఈ నెల ఒక్కటే ఎంచుకోండి. ఉదాహరణకు జీతం రాగానే చిన్న మొత్తాన్ని పొదుపుకు మళ్లించే ఆటో-ట్రాన్స్‌ఫర్ పెట్టుకోండి, లేదా రోజూ ఇరవై పేజీలు చదవండి. పెట్టుబడి విషయంలో ఏదైనా కొత్తది మొదలుపెట్టేముందు, మీ పరిస్థితికి సరిపోయేదేనా? అని అర్హత గల ఆర్థిక సలహాదారుతో ఒకసారి చర్చించండి.

రీల్స్ ఆరు వారాల్లో కోటీశ్వరుడిని చేస్తాయని చెబుతాయి. కానీ నిజమైన సంపద ఆరు వారాల్లో కాదు, ఆరు, పదహారు, ఇరవై ఏళ్ల రొటీన్‌లో తయారవుతుంది. కాబట్టి లింక్ క్లిక్ చేయడం ఆపి, ఈ రోజే ఒక్క అలవాటు మొదలుపెట్టండి. రేపటి మీరు మీకు థ్యాంక్స్ చెబుతారు.

# మోదీ ముందు.. 10 సవాళ్లు!?



నరేంద్ర మోదీ -ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు పూర్తి చేసుకున్నారు. పేదల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కోవిడ్ సంక్షోభంలో దేశాన్ని ఏకం చేయడం, స్వదేశీ టీకా అభివృద్ధికి మద్దతు, జీ-20, బ్రిక్స్ వేదికల్లో ఏకాభిప్రాయం, గ్లోబల్ సౌత్ తరఫున గళం, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్, 2025 ఆపరేషన్ సిందూర్ వంటి అంశాల తీర్మానాలను ఆమోదిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆయనకు అభినందనలు తెలిపింది. ఆ తీర్మానం -60 కోట్ల బ్యాంకు ఖాతాలు, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తేవడాన్నీ ఉదహరించింది. నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టిన నేత ఆయనే. అయితే మూడో పర్యాయం సవాళ్లు పెరిగే, అసమ్మతి గళాలు బలపడే, ప్రతి నిర్ణయాన్నీ విస్తృతంగా పరిశీలించే సమయం. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రశ్నలు పెరుగుతున్నాయి; ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ప్రధాన కమిషనర్ నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్టు నివేదికలు వచ్చాయి; ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీ సహా పలు నగరాల్లో నిరసనలు జరుగుతున్నాయి. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం, అధికార పార్టీ ఖండిస్తున్నాయి. అలాగే -ఆర్థిక వ్యవస్థ, జీడీపీ గణాంకాల విశ్వసనీయత. కొత్త సిరీస్ ప్రకారం 2026-27 తొలి త్రైమాసిక వృద్ధి 7.8 శాతంగా వెల్లడైంది, ఇది ఆర్‌బీఐ అంచనా 7 శాతానికి మించింది. కానీ మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వంటి వారు ఈ లెక్కలను ప్రశ్నించగా, మాజీ ముఖ్య గణాంకవేత్త ప్రణబ్ సేన్ కొత్త సిరీస్ "స్మెల్ టెస్ట్" నెగ్గలేదన్నారు. ప్రభుత్వ గణాంక శాఖ మాత్రం సవరణలకు కొత్త సమాచారం, మెరుగైన వనరులు, కొత్త అంచనా పద్ధతులే కారణమని వివరించింది; పాత, కొత్త సిరీస్‌లను నేరుగా పోల్చడం సరికాదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. మూడోది -ద్రవ్యోల్బణం, రూపాయి. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది; రూపాయి ఈ ఏడాది 7 శాతానికి పైగా క్షీణించి, ఆర్‌బీఐ ప్రత్యేక చర్యలు తీసుకునేలా చేసింది. ఇక నాలుగో సవాల్ -రాజకీయ ప్రతిపక్షాలు. రాహుల్ గాంధీ దూకుడు, ఎస్ఐఆర్‌పై ఉద్యమాలు ప్రభుత్వానికి ఇబ్బందులు పెంచాయి. ఐదోది యువత. నీట్ వివాదాల తర్వాత విద్యార్థులు వీధుల్లోకి వచ్చి, వారాల తరబడి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపి, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న రాజీనామా చేసేలా చేశారు. ఆరోది ఎన్డీయే అంతర్గత రాజకీయాలు. బిహార్‌లో చిరాగ్ పాశ్వాన్ శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించగా, ఓం ప్రకాష్ రాజ్‌భర్ ఉత్తరప్రదేశ్ విభజన ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దీనికి యోగి ఆదిత్యనాథ్ వ్యతిరేకంగా ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. ఏడోది ప్రభుత్వ ఇమేజ్. ఒకప్పుడు నిర్ణయాత్మకంగా కనిపించిన ప్రభుత్వం, డీలిమిటేషన్‌ను ముందుకు తీసుకెళ్లడంపైనా, ఇథనాల్ విధానంపైనా నెలల తరబడి గందరగోళంలో ఉందన్న అభిప్రాయం పెరుగుతోంది. ఎనిమిదోది మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ. ఖాళీలు భర్తీ కావడంలో జాప్యం ఉంది; విద్యా శాఖ ప్రధాన్ రాజీనామా తర్వాత ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతగానే ఉంది. జీఎస్టీ మండలి సమావేశం తర్వాత విస్తరణ ఉండొచ్చని సంకేతాలు వచ్చాయి. తొమ్మిదో సవాల్ పెట్టుబడులు, మధ్యతరగతి. అమెరికా, యూరప్, జపాన్‌వంటి చోట్ల మార్కెట్లు రికార్డులు సృష్టిస్తుండగా, భారత మార్కెట్లు ఒత్తిడిలో ఉన్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు ఈ ఏడాది ఇప్పటివరకు రికార్డు స్థాయిలో సుమారు 3.08 లక్షల కోట్ల రూపాయల ఈక్విటీలు అమ్మారు, గత ఏడాది కంటే దాదాపు రెట్టింపు. వరుసగా ఎనిమిది వారాల పతనం 25 ఏళ్లలో అత్యంత సుదీర్ఘమని నివేదికలు చెప్పాయి; ఈ నష్టాలు సిప్‌ల ద్వారా కష్టార్జితాన్ని పెట్టుబడి పెట్టిన కోట్లాది మధ్యతరగతి కుటుంబాలను తాకుతున్నాయి. పదో సవాల్ -అంతర్జాతీయ సంబంధాలు. ట్రంప్ రెండో పదవీకాలంలో భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ప్రశ్నార్థకమైంది; వాణిజ్య ఒప్పందం ఎడతెగకుండా సాగుతోంది; ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలు, ఇంధన సంక్షోభం, పాకిస్తాన్‌తో సంబంధాలు ఒత్తిడి పెంచుతున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులు, శ్రీలంకల్లో భారత ప్రభావం తగ్గిందని కొందరు నిపుణులు అంటున్నారు. అయితే ప్రభుత్వ మద్దతుదారులు భిన్నంగా వాదిస్తారు: ప్రపంచ బ్యాంకు భారత్‌ను అతివేగంగా ఎదుగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా అంచనా వేస్తోంది, ఆర్‌బీఐ ఈ ఏడాది వృద్ధి అంచనాను 7.1 శాతానికి పెంచింది, ప్రపంచ అనిశ్చితుల మధ్య ఈ సవాళ్లు ఏ ప్రభుత్వానికైనా తప్పవు.

ఈ పది సవాళ్లకు తోడు, సాంకేతిక ప్రగతి ఎంత వేగంగా సాగుతున్నా, సామాన్యుడికి రోజూ తగులుతున్న మరో ముప్పు మాత్రం అదుపులోకి రావడం లేదు: ఆన్‌లైన్ మోసాలు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) ఉన్న దేశంలో, క్షణాల్లో డబ్బు కదిలే ఆ వేగమే మోసగాళ్లకు ఆయుధంగా మారింది. జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) గణాంకాల ప్రకారం, 2021 నుంచి 2025 వరకు 65 లక్షలకు పైగా ఆర్థిక మోసాల ఫిర్యాదులు నమోదయ్యాయి, నష్టపోయిన మొత్తం 55వేల కోట్ల రూపాయలకు పైమాటే. కానీ నమోదైన ఎఫ్ఐఆర్‌లు కేవలం 1.96 లక్షలు, అంటే ఫిర్యాదుల్లో సుమారు 3 శాతం; స్తంభింపజేసిన (లియెన్) మొత్తం 8,189 కోట్లు, అంటే దాదాపు 15 శాతం. ఈ ఏడాది జూన్ 30 నాటికి 32.8 లక్షల ఫిర్యాదుల్లో 11,158 కోట్ల రూపాయలను కాపాడగలిగామని ప్రభుత్వం చెబుతోంది, ఇది ప్రశంసనీయమే, కానీ నష్టంతో పోలిస్తే చాలా తక్కువ. టెక్నాలజీ ఇంతగా ముందుకెళ్లినా వీటిని ఎందుకు అదుపు చేయలేకపోతున్నాం? కారణాలు అనేకం: మోసపు సొమ్ము చేతులు మారే 'మ్యూల్' బ్యాంకు ఖాతాలను సకాలంలో గుర్తించలేకపోవడం; కంబోడియా, మయన్మార్, లావోస్‌వంటి విదేశాల నుంచి నడిచే నెట్‌వర్కులను (కొన్ని అంచనాల ప్రకారం ఫిర్యాదుల్లో 45 శాతం విదేశీ మూలాలవి, ఇది నిర్ధారణ కాని అంచనా) పట్టుకోవడంలో సరిహద్దు, అధికార పరిమితులు; బ్యాంకులు, టెలికాం సంస్థలు, ప్లాట్‌ఫామ్‌ల జవాబుదారీతనం తగినంత లేకపోవడం; ఫిర్యాదు చేసేలోపే డబ్బు మాయమయ్యేంత వేగం; పోలీసు సిబ్బంది, సాంకేతిక నైపుణ్యాల కొరత; ఏఐ డీప్‌ఫేక్‌ల వంటి కొత్త ఆయుధాలు. పరిష్కారం కూడా ఒక్కటే కాదు: అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకుల్లో తక్షణ నిరోధక వ్యవస్థలు, మ్యూల్ ఖాతాలను గుర్తించే నిజ-సమయ సాంకేతికత, మోసం జరిగితే సేవా సంస్థలకూ బాధ్యత, అంతర్జాతీయ సహకారం, ఫిర్యాదుల నుంచి ఎఫ్ఐఆర్, రికవరీ వరకు వేగవంతమైన ప్రక్రియ, ప్రజల్లో అవగాహన. ఇది కేవలం నేర నియంత్రణ అంశం కాదు, ప్రజల నమ్మకానికి సంబంధించినది. డిజిటల్ ఇండియా విజయగాథ నిలవాలంటే, ప్రజలు తమ డబ్బు, గుర్తింపు, ఓటు, గణాంకాలు సురక్షితమని నమ్మగలగాలి. పాతికేళ్ల ప్రయాణం ఘనతే, కానీ ఈ ప్రయాణంలో ఎదురవుతున్న ప్రశ్నలకు పారదర్శకత, జవాబుదారీతనం, నిర్ణయాత్మక చర్యలతో సమాధానం చెప్పగలిగినప్పుడే, ఈ మైలురాయి నిజంగా విజయ వేడుకగా నిలుస్తుంది! ■



ఇంట్లో తలుపు తట్టే చప్పుడు వినిపిస్తే, ఎవరో తెలిసే వరకు మనసు కాస్త ఉలిక్కిపడుతుంది కదా? ఫోన్‌కు వచ్చే ప్రతి నోటిఫికేషన్ కూడా అలాంటి తలుపు చప్పుడే. చూసేలోపే "ఏం వచ్చిందో" అనే ఉత్కంఠ మొదలవుతుంది. రోజులో వందసార్లు ఇలా జరిగితే, మనసు నిరంతరం అప్రమత్తంగా, అలసటగా మారి, ఏకాగ్రత, నిద్ర దెబ్బతినవచ్చు. పని మధ్యలో వచ్చే ఒక్క నోటిఫికేషన్ కూడా మీ దృష్టిని చెదరగొట్టి, మళ్లీ పూర్తి ఏకాగ్రత రావడానికి సమయం తీసుకుంటుంది. అందుకే అనవసర నోటిఫికేషన్లను ఆపేయండి, ముఖ్యమైనవే ఉంచండి. మీ ఫోన్ మీకు సేవ చేయాలి, మీరు ఫోన్‌కు కాదు; ప్రశాంతత మీ ఎంపిక.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# రోడ్డెక్కిన మహా 'గుమ్మడి'



అమెరికాలోని నార్త్ కరోలినా కేరీలో 'ఫిలిప్స్ ఫామ్స్' వార్షిక 'పంప్కిన్‌ఫెస్ట్' జరుగుతుండగా, ఇల్లంత పరిమాణంలో ఉన్న ఒక భారీ గాలి గుమ్మడికాయ గాలి ఉద్ధృతికి కట్లు తెంచుకుని రోడ్డుపై దొర్లుకుంటూ పరుగందుకుంది! "అది మన కారును తగులుతుంది!" అంటూ కారులో ఉన్నవారు అరుస్తుంటే, ఒక ఉబర్ డ్రైవర్ కారును రివర్స్ చేశాడు. చివరికి ఆ డ్రైవర్, ఇతర స్థానికులు కలిసి దాన్ని ఆపి, గాలి తీసి ఫామ్‌కు చేర్చారు. "పంప్కిన్‌ఫెస్ట్ ఈసారి కొంచెం 'ఆఫ్ కిల్టర్' అయింది, కానీ గుమ్మడికాయను దొర్లనిచ్చి అద్భుతమైన ఆదివారం గడిపాం" అని ఫామ్ సరదాగా పోస్ట్ చేసింది. సాయం చేసినవారికి ఉచిత టికెట్లు కూడా ఇచ్చారు!

ఏడాదంతా లభించే తక్కువ ధరకు .. ఎక్కువ పోషకాలతో మార్కెట్లో లభించే పండ్లలో జామకాయ ఒకటి. చాలామంది ఇళ్లలో గోడ పక్కన బయట ఈ చెట్టును పెంచుకుంటారు. అంటే జామకాయలంటే పిల్లలకు.. పెద్దలకు ఎంత ఇష్టమో మరే వేరే చెప్పనక్కరలేదు. వీటిని డైరక్ట్‌గా తింటారు. కొంతమంది సలాడ్స్, స్నాక్స్ రూపంలో.. మరికొంత మంది జ్యూస్ చేసుకుంటారు.. ఇలా ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు జామపండును ఆరగిస్తారు. కాని దీనిని ఎప్పుడు పడితే అప్పుడు తినకూడదని .. నిత్యం కొన్ని సమయాల్లోనే తినాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరి జామ పండును ఎప్పుడు తినాలి.. ఏ సమయంలో తినాలి.. మొదలగు విషయాలను ఈస్టోరీలో తెలుసుకుందాం. . .!



# జామకాయ తింటే ఎంతో ఆరోగ్యం.. కాని ఎప్పుడు తినాలి.. ఎప్పుడు తినకూడదు..

జామకాయలు టేస్టే వేరు.. అంతే కాదు.. అనేక రోగాలకు మంచి మందు కూడా.. దీనిలో ఉండే పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జామపండును తీసుకోవడం వల్ల మన మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామకాయలను తీసుకోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలు గురించి అలాగే దీనిని తీసుకునే సరైన సమయం గురించి పోషకాహార వైద్యులు వివరిస్తున్నారు. దీనిని ఎప్పుడు పడితే అప్పుడు తినకూడదని నిపుణులు చెబుతున్నారు.



**ఎప్పుడు తినాలి..**

జామకాయ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు తినాలి. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసిన తరువా 30 నిమిషాల తరువాత గంటలోపుగా ఒక మోస్తరు ( చిన్నసైజు) జామకాయను తింటే ఎలాంటి ఇబ్బంది లేకుండా తిన్న పదార్ధం జీర్ణక్రియ జరుగుతుందని చెబుతున్నారు. కాని రాత్రి సమయంలో జామపండును అసలు తినకూడదు

ఇంకా మధ్యాహ్నం భోజనం చేసిన 2 గంటల తరువాత జామకాయ తింటే ఆరోగ్యానికి మంచిది. ఎక్కడైనా ఫంక్షన్లకు వెళ్లినప్పుడు మాత్రం అన్నం తిన్న తరువాత తప్పకుండా జామపండును తినాలి. ఇలా తినడం వలన జీర్ణక్రియలో ఎలాంటి సమస్యలు రావు. పొద్దున్నే పరగడుపున .. ఖాళీ కడుపుతో మాత్రం అస్సలు జామపండు తినకూడదు. ఇలా తింటే జామపండు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వాటితో ఉండే పోషకాలు శరీరానికి అంది.. చాలా ఎక్కువుగా ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**రుచితో పాటు ఆరోగ్యం**

జామకాయలు రుచితో పాటు ఆరోగ్యానికి మేలు కలుగజేస్తాయి. వీటిలో విటమిన్ సి తో పాటు అనేక సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. దీనిని దేశీ సూపర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. 100 గ్రాముల జామకాయల్లో 68 కిలో కేలరీలు, 2.5 గ్రా. ప్రోటీన్, 14 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 5.4 గ్రాముల ఫైబర్ కంటెంట్ ఉంటుంది. అలాగే 100 గ్రాముల జామపండులో దాదాపు 228 మి.గ్రా. విటమిన్ సి ఉంటుంది. జామపండునుతినడం వలన పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. తద్వారా తిన్న ఆహారం సులభంగా జీర్ణమవ్వడంతో పాటు మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

**విటమిన్ సి..**

జామపండు మన శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వైద్య నిపుణలు తెలిసిన వివరాల ప్రకారం రోజూ ఒక జామపండును తింటే శరీరానికి కావల్సిన విటమిన్ సి అందడంతో చర్మ ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు చర్మం బిగుతుగా తయారవుతుంది. ఇంకా ఇందులో లభించే విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది.

**బరువు అదుపులో..**

జామపండులో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉండటం వలన బీపీ అదుపులో ఉంటుంది.

శరీర బరువును అదుపులో ఉంచడంలో కూడా జామపండు మనకు సహాయపడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో శరీర బరువు అదుపులో ఉంటుంది.

జామపండును తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. జామపండు తక్కువ గ్లైసెమిక్ స్థాయిలను కలిగి ఉంటుంది. కనుక షుగర్ వ్యాధి గ్రస్తులు కూడా ఈ పండును తింటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. జామపండులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కనుక దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్లు త్వరగా మన దరి చేరకుండా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.. కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్

- బుమ్రా లాంటి బౌలర్‌కు ప్రత్యామ్నాయం లేదని చెప్పిన సంజూ శాంసన్
- యువ బౌలర్లు అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్‌లను ప్రశంసించిన వికెట్ కీపర్
- అద్భుతంగా ఆడుతున్న షాయ్ హోప్‌ను గౌరవించాల్సిందేనని వ్యాఖ్య
- తిలక్ వర్మ ఔట్ కావడమే మ్యాచ్‌లో కీలక మలుపు అని వెల్లడి
- ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు మద్దతుగా నిలిచిన శాంసన్



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు.ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు.వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు.

ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు.

ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.

# ఈ చెత్త బౌలింగ్‌తో మనం వరల్డ్‌కప్ గెలవడం చాలా కష్టం.. మాజీ క్రికెటర్ వ్యాఖ్యలు వైరల్





హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. విండీస్ నిర్దేశించిన 247 రన్స్ లక్ష్య ఛేదనలో టీమిండియా ఘోరంగా తడబడింది. ఈ నేపథ్యంలో ఇండియన్ బౌలర్ల ప్రదర్శనపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుత బౌలింగ్ కాంబినేషన్‌తో భారత్ ఐసీసీ ప్రపంచకప్ గెలవడం చానా కష్టమని తేల్చి చెప్పేశాడు.

**బౌలర్ల వైఫల్యమే భారత్ కొంపముంచింది:**

మాజీ క్రికెటర్ కైఫ్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణం బౌలింగ్ వైఫల్యమే.. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించారు. 247 రన్స్ ఇవ్వడమంటే మాములు విషయం కాదు. ఇదే తొలిసారి కాదు, అంతకుముందు కూడా 250ం టార్గెట్‌ను కాపాడుకోవడంలో భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటర్లు 3 మ్యాచ్‌లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు ఓడించారు. ఇలాంటి కాంబినేషన్‌తో ప్రపంచకప్ నెగ్గడం అసాధ్యం అని కైఫ్ హెచ్చరించారు.

**2024 ప్రపంచకప్ విజయంతో పోలిక:**

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ భాగస్వామిగా నిలిచారు అని మహమ్మద్ కైఫ్ గుర్తు చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి బౌలర్లతో పాటు బ్యాటర్లు సత్తా చాటారని పేర్కొన్నాడు. ఇక నాలుగో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. ప్రతి బ్యాటర్ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం కష్టమని, సంజు శాంసన్ మాత్రం జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడని కైఫ్ అభిప్రాయపడ్డారు.

# యువ క్రికెటర్లను యువరాజ్ ఎలా తిట్టేవాడో తెలుసా.. పాత రోజులని గుర్తు చేసుకున్న రోహిత్



భారత క్రికెట్ చరిత్రలోనే డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' షో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సహచర ఆటగాళ్ల వ్యక్తిత్వాలపై హిట్‌మ్యాన్ చేసిన వ్యాఖ్యలు ఒకవైపు నవ్విస్తూనే, మరోవైపు భారత క్రికెట్‌లోని క్రమశిక్షణ, సీనియర్-జూనియర్ అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఇండియన్ ప్లేయర్స్ క్రికెటర్లు కాకపోయి ఉంటే ఏ ప్రొఫెషన్ సెలక్ట్ చేసుకునేవారనే ప్రశ్నకు రోహిత్ ఇచ్చిన ఆన్సర్ ఇప్పుడు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది.

**జస్ప్రీత్ బుమ్రా డాక్టర్ అయ్యేవాడు:**

బాలీవుడ్ స్టార్ కమెడియన్ కృష్ణ అభిషేక్ అడిగిన ప్రశ్నకు రోహిత్ శర్మ స్పందిస్తూ.. ప్రపంచ నంబర్ వన్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా గనుక క్రికెటర్ కాకపోతే ఖచ్చితంగా డాక్టర్ అయ్యేవాడని చెప్పాడు. మైదానంలో మ్యాచ్ చివర్లో చావు బతుకుల మధ్య పోరాడుతున్న సమయంలో, బౌలింగ్ కి వచ్చి ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను కాపాడే ప్రాణదాతలా బుమ్రా నిలుస్తాడని కొనియాడాడు. ఆ ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను గెలిపించడం అందరికీ సాధ్యమయ్యే పని కాదని హిట్ మ్యాన్ తేల్చి చెప్పాడు.

**యంగ్ క్రికెటర్లని యువీ ఘోరంగా తిట్టేవాడు:**

మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను రోహిత్ శర్మ 'హెడ్‌మాస్టర్' తో పోల్చాడు. 2006, 2007 కాలంలో తాము కొత్తగా జట్టులోకి వచ్చినప్పుడు యువీ భాయ్ ఒక కఠినమైన హెడ్‌మాస్టర్‌లా వ్యవహరించేవాడని గుర్తు చేసుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణ విషయంలో జూనియర్లను బాగా తిట్టేవాడని, అయితే ఆ తిట్ల వెనుక ఎంతో ఆప్యాయత, ప్రేమ దాగి ఉండేవని పేర్కొన్నాడు. ఆరంభంలో సీనియర్లతో ఆడుతున్నప్పుడు ఉన్న భయం, బెరుకును పోగొట్టి, తమను పూర్తి కంఫర్టబుల్‌గా మార్చడంలో యువరాజ్ పాత్ర మరువలేనిదని రోహిత్ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.ఇక రిషభ్ పంత్‌ను రోహిత్ పర్ఫెక్ట్ 'బేబీ సిట్టర్' గా అభివర్ణించాడు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆటగాళ్ల కుటుంబాలు, పిల్లలు మాతో వచ్చేవాళ్లని.. ప్రాక్టీస్ పూర్తయిన వెంటనే పంత్ పిల్లలతో గడిపేవాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అప్పటి కెప్టెన్ టిమ్ పైన్ 'బేబీ సిట్టర్' అని పిలవడానికి అసలు ముచ్చట ఇదే.. అయితే పిల్లలతో అంత ప్రేమగా ఆడుకుంటూనే, సరదాగా వారి ప్లేట్లలోని ఫుడ్ లాక్కుని తినేసేవాడని, దాంతో ఆ పిల్లలు రిషభ్ పంత్ ని చూసి చిరాకు పడేవారంటూ డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లను రోహిత్ శర్మ నవ్వులు పూయిస్తూ పంచుకున్నాడు.



# ఒకే మూడ్.. ఒకే టెంప్లేట్.. బన్నీ సినిమాకు మొదట్లోనే ట్విస్ట్!





టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. ఏ పెద్ద సినిమా చూసినా ఒకే తరహా టెంప్లేట్, ఒకే మూడ్ కనిపిస్తోంది. హీరోలందరూ తెరపై సరికొత్తగా కనిపించాలని తాపత్రయపడుతున్నప్పటికీ.. చివరికి అందరూ ఒకే రకమైన డార్క్, రస్టిక్ ప్రపంచాల్లోకే అడుగుపెడుతున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఏదో ఒక సినిమా క్లిక్ అవ్వగానే, మిగిలిన డైరెక్టర్లంతా తమ హీరోలను కూడా అదే మూస ధోరణిలోకి నెట్టేస్తున్నారనే చర్చ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నాని చేసిన 'ది ప్యారడైజ్', బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' ప్రాజెక్టుల విషయంలో ఈ పోలికలు ఎక్కువగా వినిపించాయి. ఈ రెండు భారీ చిత్రాలు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ డ్రామాలే. అయితే స్క్రీన్ పై కనిపించే డార్క్ విజువల్స్ నుంచి హీరో ఎలివేషన్లు, హెవీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు రెండింటి మధ్య ఉన్న డిఫరెన్స్ చూసి.. ఇవి రెండూ ఒకే ఫార్మాట్ లో అటు ఇటు తిప్పి తీసినట్లు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.స్టార్టింగులో ఇలాంటి రస్టిక్ అవతారాలు, రక్తపాతం ఆడియన్స్ కు కాస్త థ్రిల్ ఇచ్చాయి. కానీ వరుసగా ప్రతి స్టార్ హీరో అదే మట్టి గెటప్, అదే గ్యాంగ్ స్టర్ నేపథ్యంతో వస్తుంటే థియేటర్లలో ఫ్రెష్ నెస్ పూర్తిగా దెబ్బతింటోంది. సినిమా టైటిల్ మారినా చూసే విజువల్స్ లో తేడా లేకపోవడంతో ఆడియన్స్ లో క్రమంగా విసుగు మొదలవుతోంది. క్రియేటివిటీ అంటే స్క్రీన్ మొత్తం నలుపు, ఎరుపు రంగులతో నింపేయడం కాదనే విమర్శలు ఇండస్ట్రీ వర్గాల నుంచే వస్తున్నాయి.ఈ రొటీన్ ఫార్ములా సెగ ఇప్పుడు అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ూూ23 కు కూడా తగిలింది. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వగానే బన్నీ లుక్ కోసం ముంబైలో ప్రత్యేకంగా ఒక లుక్ టెస్ట్ వీడియోను షూట్ చేశారట. ఆ వీడియోతోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే సరిగ్గా అదే టైమ్ లో మరో స్టార్ హీరో గ్యాంగ్ స్టర్ మూవీ నుంచి అచ్చం అలాంటి డార్క్ టోన్ తో ఉన్న ప్రమోషనల్ వీడియో బయటకు వచ్చింది.వేరే సినిమా వీడియోతో తమ కాన్సెప్ట్ సింక్ అవుతుండటాన్ని గమనించిన ూూ23 టీమ్ వెంటనే అప్రమత్తమైంది. ఇప్పుడు తాము ఆ వీడియోను రిలీజ్ చేస్తే వేరే సినిమాను కాపీ కొట్టినట్లు ఉంటుందనే ఉద్దేశంతో, తమ పాత ప్రమోషనల్ ప్లాన్ ను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తమ లుక్ టెస్ట్ ను మళ్లీ కొత్తగా ఎలా డిజైన్ చేయాలనే దానిపై లోకేష్ టీమ్ పునరాలోచనలో పడింది. ఒకే ట్రెండ్ ను అందరూ ఫాలో అవ్వడం వల్ల మొదట్లోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.తెలుగు సినిమాకు అసలైన బలం వైవిధ్యమైన కథలను, లోతైన ఎమోషన్లను చూపించడమే. ఒక హీరోకు లేదా ఒక దర్శకుడికి వర్కౌట్ అయిన స్టైల్ ఇండస్ట్రీలో అందరికీ సెట్ అవుతుందనే గ్యారెంటీ ఉండదు. ప్రతి ప్రాజెక్ట్ కు ఒక విలక్షణమైన ఐడెంటిటీ ఉన్నప్పుడే ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. పాత సక్సెస్ ఫార్ములాలను జిరాక్స్ తీయడం మానేసి, రూట్ మార్చి కొత్త ఐడియాలతో వస్తేనే దర్శకులకు బాక్సాఫీస్ దగ్గర లాంగ్ రన్ ఉంటుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965